ప్రతిపక్షం

www.prathipaksham.in

ఆదివారం 05.04.2026 | Published From Hyderabad | సంపుటి: 19 సంచిక: 16 పేజీలు: 8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



రిజ్వీ అర్ధసెంచరీ.. ఢిల్లీ ధనాధన్ విక్టరీ 8

కేరళలో మానవీయ విలువలు పోయాయి



- కమ్యూనిజం పోయి.. గూండాయిజం వచ్చింది
- కేరళ ప్రచారంలో భట్టి విక్రమార్క
- మెరుగైన పాలన కోసం యూడీఎఫ్ అభ్యర్థులను గెలిపించండి
- కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

పత్తనంతిట్ట, ఏప్రిల్4: కేరళలో పాలన, మానవీయ విలువలు దారుణంగా పడిపోయాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో విమర్శించారు. కేరళ అంటే కమ్యూనిజం, మార్క్సిజం గురించి మాట్లాడుతారు కానీ అది నేడు పక్కకు పోయి గూండాయిజం మాత్రమే కనిపిస్తోందని దుయ్యబట్టారు. గత ఎన్నికల ముందు ఎల్‌డీఎఫ్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఆయన ఆరోపించారు. ఈనెల 9న జరుగనున్న ఎన్నికల్లో యూడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన కేరళ రాష్ట్రంలోని

...:: మిగతా 2లో



ఆలయాల పరిసరాల్లో
తిరుమల తరహా నిబంధనలు

- రాజకీయ ప్రదర్శనలు లేకుండా ఆధ్యాత్మికతకు పెద్దపీట
- సంప్రదాయాలకు అనుగుణంగా బాసర ఆలయ అభివృద్ధి
- విశాలమైన రోడ్లు, ఆలయ ప్రాంగణం మొక్కలు నాటాలని సూచన
- జ్ఞాన సరస్వతి ఆలయ అభివృద్ధిపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఏప్రిల్4: రాష్ట్రంలో ప్రముఖ ఆలయాల పరిసరాల్లో తిరుమల తరహాలో నిబంధనలు అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాజకీయ పార్టీల సభలు, జెండాలు, ప్రదర్శనలు లేకుండా ఆధ్యాత్మికతకు పెద్దపీట వేయాలని సీఎం సూచించారు. బాసర జ్ఞాన సరస్వతి దేవాలయ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. తొలుత బాసర ఆలయ అభివృద్ధికి సంబంధిచిన మాస్టర్ ప్లాన్ ను అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించారు. ఆలయ అభివృద్ధి పనులకు రూ.225 కోట్ల వ్యయమవుతుందని అధికారులు తెలియజేశారు. మాస్టర్‌ప్లాన్‌ను పరిశీలించిన సీఎం పలు మార్పులు సూచించారు. సంప్రదాయాలు,

...:: మిగతా 2లో

ఫీజు దోపిడీపై ముఖ్యమంత్రి మౌనం ఎందుకు?

- ఫీజుల నియంత్రణ బిల్లుపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఎందుకు పెట్టటం లేదు
- విద్యాకమిషన్ ముసాయిదా బిల్లుపై కాలాయాపన ఎందుకు?
- కార్పొరేట్ విద్యాసంస్థల మాఫియాతో ప్రభుత్వానికి ఉన్న లాలూచీ ఏంటీ?
- విచ్చలవిడిగా ఫీజుల పెంపుతో విద్యార్థుల జీవితాలు ఆగమవుతున్నాయి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఏప్రిల్ 4 : కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలను ఆగం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల మీద ఈ ప్రభుత్వానికి అంత ప్రేమెందుకని నిలదీశారు. మహిళా బిల్లు కోసం ప్రత్యేకంగా పార్లమెంట్ సమావేశాలు నిర్వహించినప్పుడు లక్షలాది మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు న్యాయం చేసేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఎందుకు నిర్వహించటం లేదని ప్రశ్నించారు. వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని కోరారు. దీనిపై తెలంగాణ విద్యా కమిషన్ ముసాయిదా బిల్లు సిద్ధం చేసి నెలలు గడుస్తున్నా ఎందుకు కాలయాపన చేస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్పొరేట్ విద్యాసంస్థల

...:: మిగతా 2లో





ఆరు నుంచి హెల్త్ వీక్

- 6న ఉదయం నెక్లెస్ రోడ్డులో ఈట్ రైట్ వాక్
- 7న డాక్టర్లకు నియామక పత్రాలు
- నిమ్స్ లో అందుబాటులోకి లినాక్ సేవలు
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఏప్రిల్ 4: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 6 నుంచి 11వ తేదీ వర హెల్త్ వీక్ నిర్వహించనున్నారు. హెల్త్ వీక్ కార్యక్రమాలపై ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచేలా, ప్రభుత్వ వైద్య సేవలను మరింత చేరువ చేసేలా కార్యక్రమాలు ఉండాలని మంత్రి సూచించారు. హెల్త్ వీక్ లో ప్రతి రోజూ ప్రత్యేక థీమ్ తో నిర్వహించే కార్యక్రమాల వివరాలను సమీక్షించిన మంత్రి అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. అన్ని కార్యక్రమాల్లోనూ విద్యార్థులు, మహిళలు, యువతను భాగస్వాములను చేయాలని మంత్రి సూచించారు. ఆహార నాణ్యత ప్రాముఖ్యతను తెలిపేలా ఏప్రిల్ 6న ఫుడ్ సేఫ్టీ ఫోకస్ డే నిర్వహించనున్నారు. ఆరోజు ఉదయం 6.30 గంటలకు హైదరాబాద్ నెక్లెస్ రోడ్ వద్ద ఈట్ రైట్ వాక్ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3.00 నుంచి నేచురోపతి హాస్పిటల్లో 40 స్టాళ్లతో మిల్లెట్ మేళా నిర్వహించనున్నారు. ఇదే కార్యక్రమంలో ఫుడ్ హ్యాండ్లర్లకు శిక్షణ, స్ట్రీట్ ఫుడ్

...:: మిగతా 2లో

బీఆర్ఎస్ ఖాతాలో మరో రెండు మున్సిపాలిటీలు





- ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లిలో బీఆర్ఎస్‌చైర్మన్లు
- ఇబ్రాహీంపట్నంలో బీఆర్ఎస్, బీజేపీ చెట్టాపట్టాల్
- వైఎస్ చైర్మన్‌గా బీజేపీ కౌన్సిలర్‌శ్యామల ఎన్నిక
- ఖానాపూర్ ఎన్నిక వాయిదా
- ఖానాపూర్లో సైతం బీజేపీ, బీఆర్ఎస్ కూటమి
- బీజేపీ చైర్మన్‌అభ్యర్థికి బీఆర్ఎస్ మద్దదు?
- ఖ్యాతన్ పల్లిలో బీఆర్ఎస్, సీపీఐ దోస్తీ
- చైర్మన్ గా బీఆర్ఎస్ అభ్యర్థి, వైఎస్ చైర్మన్ గా సిపీఐ కౌన్సిలర్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఏప్రిల్4: గతంలో ఆగిపోయిన మూడు మున్సిపల్ చైర్మన్, వైఎస్ చైర్మన్ ఎన్నికల్లో రెండు మున్సిపాలిటీలు బీఆర్ఎస్ ఖాతాలో వేసుకుంది. మరో మున్సిపాలిటీ ఖానాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో గందరగోళం నెలకొనడంతో ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నికపై ఉత్కంఠకు

...:: మిగతా 2లో





ఇంకా 48 గంటలే మిగిలి ఉంది

- హర్మూజ్ జలసంధిని తెరవాలి
- ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక
- కాల్పుల విరమణకు ఇరాన్ 'నో'
- మరో అమెరికా యుద్ధవిమానం కూల్చివేత
- తర్వాతి టార్గెట్ బాబ్ ఎల్ మండేబ్?
- ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ సంకేతాలు
- ప్రపంచ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి హెచ్చరిక చేశారు. తమతో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇరాన్‌కు మరో 2 రోజులే మిగిలి ఉందని ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. 48 గంటల్లోగా ఇరాన్ తమతో ఒప్పందం చేసుకోవాలని లేదా హర్మూజ్ జలసంధిని తెరవాలని రాసుకొచ్చారు. రెండింటిలో ఏది అమలు చేయకపోయినా విధ్వంసకర దాడులు చేస్తామని ఇరాన్‌ను హెచ్చరించారు. ఈనెల 6 లోగా తమతో ఒప్పందం చేసుకోకపోతే ఇరాన్ విద్యుత్ కేంద్రాలు సహా అణుకేంద్రాలపై భీకర దాడులు చేస్తామని గత నెలలో ట్రంప్ తెలిపారు. తాజా హెచ్చరికలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉంది.

కాల్పుల విరమణకు ఇరాన్ 'నో'- మరో అమెరికా యుద్ధవిమానం కూల్చివేత

ఇరాన్ అమెరికా మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకూ మరింత పెరుగుతున్నాయి. తాజా పరిణామాల్లో,

...:: మిగతా 2లో



రేవంత్ రెడ్డి చెబుతున్నవన్నీ.. అబద్ధాలే

- కేరళలో మళ్లీ కాంగ్రెస్ ను ఓటమి తథ్యం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సవాల్

...:: 5లో



నేను గాయపడ్డాను..

తనపై తీవ్ర ఆరోపణలు చేసిన ఆప్ పార్టీ నేతలకు ఎంపీ రాఘవ్ చడ్డా తనదైన రీతిలో కౌంటర్ ఇచ్చారు. తాజాగా ఓ వీడియో విడుదల చేసిన ఆయన 'దురంధర్' చిత్రంలోని "నేను గాయపడ్డాను. అందుకే మరింత ప్రమాదకరంగా మారాను" అనే డైలాగ్‌తో సమాధానం ఇచ్చారు.

7



మైనారిటీలపై దాడులు చేసే వారితో సీఎం విజయన్ సంబంధాలు

దేశంలోని ఇతర ప్రాంతాలలో మైనారిటీలపై దాడి చేసే వ్యక్తులతో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు సంబంధాలున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు.

7



నాసిక్ జిల్లాలో ఘోర ప్రమాదం

మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ఓ ఎర్టిగా కారు బావిలోకి దూసుకెళ్లడంతో ఆరుగురు చిన్నారులతో సహా 9 మంది మరణించారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం గమనార్హం. వాహనంపై నియంత్రణ కోల్పోవడం వల్ల ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

7



పుదుచ్చేరికి రాష్ట్ర హోదా

పుదుచ్చేరికి పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను సాధించడానికి కృషి చేస్తామని టీవీకే అధినేత విజయ్ హామీ ఇచ్చారు. కేంద్రంలో దశాబ్దాలుగా అధికారంలో ఉన్నప్పటికీ, కాంగ్రెస్, బీజేపీలు పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పించలేదని విజయ్ గుర్తు చేశారు.

7

రాష్ట్రీయం

ఆలయాల పరిసరాల్లో తిరుమల తరహా నిబంధనలు

మొదటిపేజీ తరువాయి

శాస్త్రాలను పరిగణనలోకి తీసుకొని భక్తుల విశ్వాసాలకు పెద్దపీట వేస్తూ బాసర ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని సీఎం సూచించారు. భవిష్యత్ అవసరాలు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని విశాలమైన రోడ్లు నిర్మించాలని సీఎం ఆదేశించారు. ఆలయ ప్రాంగణం భవిష్యత్‌లో భారీ వృక్షాలతో అలరారేలా అవసరమైన మొక్కలు నాటాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఆలయం సమీపంలో హెల్త్ సెంటర్ నిర్మించాలని, పుష్కరాలు, ఇతర ఉత్సవాల రోజుల్లో అక్కడ తగిన సంఖ్యలో వైద్యులు, వైద్య సిబ్బంది ఉండి భక్తులకు సేవలు అందించేందుకు అనువుగా దానిని నిర్మించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎంతటి ప్రముఖుల వాహనాలైనా ఆలయ ప్రాంగణానికి బయటే నిలిచిపోవాలని, ఆలయ ప్రాంగణంలోకి కేవలం ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) ద్వారానే చేరుకునేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. వాహనాల పార్కింగ్ ప్రదేశంలో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేయాలన్నారు. అభివృద్ధి పనుల సమయంలో ఆలయ పవిత్రతకు ఎటువంటి భంగం కలగకుండా జాగ్రత్త పడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడితే ఏమాత్రం సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. సమీక్షలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

కేరళలో మానవీయ విలువలు పోయాయి

మొదటిపేజీ తరువాయి

పత్తనంతిట్ట అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం, ర్యాలీల్లో పాల్గొన్నారు., 'శబరిమల ఆలయంలో కుంభకోణం జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి, నిరుద్యోగం భారీగా పెరిగిపోయింది, పొట్ట చేత పట్టుకొని కేరళ యువత ప్రపంచం నలుమూలలకు వలస పోతుండగా ఇక్కడ సీనియర్ సిటిజన్స్‌కు సరైన సంక్షేమం, ఆదరణ లేకుండా పోయింది'అని భట్టి స్థానిక పరిస్థితులను ఓటర్లకు వివరించారు. 'కేరళ అంటే సెక్యులరిజం, ఉన్నత విద్యావంతులు, గొప్ప మానవీయ కోణం ఉంటుందని అంతా భావిస్తాం కానీ ఈరోజు కేరళలో ఆ తరహా పరిస్థితులు కనిపించకుండా పోయాయి'అని ఆవేదన వ్యక్తం చేశారు.

మా దగ్గర ఉచిత బస్సు..

తెలంగాణ రాష్ట్రంలో మహిళలు ఏ మూల నుంచి ఏ మూలకైనా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించామని, రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలు ఉంటే ఇందులో 1.06 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం అందజేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. విద్యపై కేరళ కంటే తెలంగాణ ఎక్కువ వ్యయం చేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యుడు రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరు నుంచి హెల్త్ వీక్

మొదటిపేజీ తరువాయి

వ్యాపారులకు సర్టిఫికెట్ల పంపిణీ, హైజీన్ రేటింగ్ సర్టిఫికెట్ల పంపిణీ చేపట్టనున్నారు. జిల్లాల్లో కూడా ఉదయం ఈట్ రైట్ వాక్లు, మధ్యాహ్నం ఫుడ్ రిజిస్ట్రేషన్ మేళాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రి సూచించారు. కేన్సర్ పేషెంట్లకు అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు నిమ్స్ ఏర్పాటు చేసిన అధునాతన 'లినాక్'యంత్రాన్ని ఉదయం 10 గంటలకు మంత్రి ప్రారంభిం చనున్నారు. అనంతరం రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. ఇందులో తెలంగాణ కేన్సర్ రిజిస్ట్రీ ప్రారంభం, ట్రామా కేర్ పాలసీ, క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ పోర్టల్ పీసీ& పీఎన్డీటీ, ఏఆర్టీ సరోగసీ పోర్టల్స్ ప్రారంభం, అవార్డుల ప్రదానం వంటి కార్యక్రమాలు ఉంటాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులకు ఎంపికైన 871 మంది డాక్టర్లకు మంత్రి నియామక పత్రాలు అందజేయనున్నారు. అనంతరం, ఎర్రగడ్డలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భవనాన్ని మంత్రి ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాలు రాష్ట్ర ఆరోగ్య రంగ అభివృద్ధికి దోహదపడేలా సమర్థంగా నిర్వహించాలని మంత్రి సూచించారు. 8న సేఫ్ మదర్ డేగా నిర్వహిస్తూ ఉదయం 11 గంటలకు బోయిగూడలోని మిడ్వైఫరీ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లాల్లో ఏఎన్సీ పరీక్షలు, హైరిస్క్ కేసుల గుర్తింపు, ప్రసూతి సేవలపై వర్క్షాప్ నిర్వహణ, గ్రామస్థాయిలో మహిళలకు అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. ఎయిడ్స్ అవగాహన కల్పించేందుకు ఉదయం 7 గంటలకు హైదరాబాద్ లో రెడ్ రన్ నిర్వహించనున్నారు. జిల్లాల్లో కూడా ఇదే సమయానికి అవగాహన ర్యాలీలు నిర్వహించాలని మంత్రి సూచించారు.





బీఆర్ఎస్ ఖాతాలో మరో రెండు మున్సిపాలిటీలు

మొదటిపేజీ తరువాయి

తెరపడింది. రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని బీఆర్ఎస్ పార్టీ దక్కించుకుంది. ఛైర్మన్‌గా టేకుల సుదర్శన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. వైస్ ఛైర్‌పర్సన్‌గా బీజేపీ కౌన్సిలర్ ముత్యాల శ్యామల ఎన్నికయ్యారు.

ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా

మరోవైపు మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీని బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. క్యాతనపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి సంధ్యారాణి ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్ పదవిని సీపీఐ అభ్యర్థి సరిత దక్కించుకున్నారు. ఈ ఎన్నికకు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు దూరంగా ఉన్నారు. మరోవైపు ఖానాపూర్ ఛైర్మన్ ఎన్నిక నేపథ్యంలో కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వివాదం నెలకొంది. అధికారులతో ఎమ్మెల్యే, కాంగ్రెస్ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. దీంతో ఛైర్మన్ ఎన్నిక గందరగోళం మధ్య వాయిదా పడింది. ముందుగా ఛైర్‌పర్సన్ ఎన్నిక వేళ అధికారులు బీజేపీ అభ్యర్థి మౌనిక పేరు ప్రతిపాదించారు. మౌనికకు మద్దతుగా ఎనిమిది మంది కౌన్సిలర్లు చేతులెత్తారు. ఎన్నిక తీరుపై ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందుగా బీజేపీ అభ్యర్థి పేరు ఎలా ప్రతిపాదిస్తారంటూ ఆందోళన చేశారు. అధికారులతో వెడ్మ బొజ్జు వాగ్వాదానికి దిగారు. దీంతో ఛైర్మన్ ఎన్నికను రేపటికి వాయిదా వేశారు. ఎప్పుడు నిర్వహించాలనే దానిపై సందిగ్ధత నెలకొంది. సమావేశం నుంచి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు బయటకు వెళ్లిపోయారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ధర్నా

మున్సిపల్ కార్యాలయం ముందు బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఆందోళన చేశారు. వెడ్మ బొజ్జుకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ అభ్యర్థికి మెజారిటీ ఉన్నా ఛైర్మన్‌గా ప్రకటించలేదని బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఆందోళన చేశారు. ఖానాపూర్ మున్సిపాలిటీలో మొత్తం 12 వార్డుల్లో అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి ముగ్గురు కౌన్సిలర్లు గెలుపొందగా స్వతంత్రంగా గెలిచిన మూడోవార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ లో చేరడం, ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో ఓటుతో ఆ పార్టీ బలం ఐదుకు చేరింది. బీఆర్ఎస్ కు నలుగురు కౌన్సిలర్లు, బీజేపీకి నలుగురు కౌన్సిలర్లు ఉండటంతో ఖానాపూర్ లో హంగ్ ఏర్పడింది. . బీజేపీ, బీఆర్ఎస్ కలిసి అధికారం చేజిక్కించుకోవాలని చూస్తుంటే, ఛైర్మన్ పదవి చేజారకుండా అధికార పార్టీ ఎత్తుగడలు వేస్తోందని సమాచారం.

ఇంకా 48 గంటలే మిగిలి ఉంది

మొదటిపేజీ తరువాయి



అమెరికా ప్రతిపాదించిన 48 గంటల కాల్పుల విరమణను ఇరాన్ స్పష్టంగా తిరస్కరించింది. మధ్యవర్తి దేశం పాకిస్థాన్‌ద్వారా ప్రతిపాదన పంపినప్పటికీ, టెహ్రాన్ తన కఠిన వైఖరిని కొనసాగిస్తూ ఆ ఆఫర్‌ను అంగీకరించలేదు. ఆ నిర్ణయం ప్రస్తుతం పశ్చిమాసాయిలో ప్రాంతంలో కొనసాగుతున్న సైనిక ఉద్రిక్తతలకు మరింత ఊతమిచ్చింది. ఇదిలా ఉండగా, ఇరాన్ అణు శక్తి సంస్థ, అంతర్జాతీయ అణుశక్తి సంస్థపై తీవ్ర ఆరోపణలు చేసింది. తమ అణు కేంద్రాలపై జరిగిన దాడులను అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఖండించకపోవడం స్పష్టమైన సహకారంగా అభివర్ణించింది. ఈ అంశంపై ఇరాన్ అణు శక్తి సంస్థ చీఫ్ మహ్మద్ ఎస్లామీ పలుమార్లు ఐఏఈఐ డైరెక్టర్ జనరల్ రఫాయెల్ గ్రోస్సీని సంప్రదించినట్లు సమాచారం. అణు శక్తి కేంద్రాలు శాంతియుత ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నవని, వాటిపై దాడులను ఖండించాలని ఆయన కోరారు.

తర్వాతి టార్గెట్ బాబ్ ఎల్-మండేబ్?

హొర్ముజ్ జల సంధి ఇప్పటికే ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో మరో కీలకమైన ప్రపంచ నౌకా రవాణా మార్గమైన బాబ్ ఎల్‌మండేబ్ జల సంధిపై దృష్టి సారించడం ద్వారా ఒత్తిడిని మరింత పెంచవచ్చని ఇరాన్ సంకేతాలు ఇచ్చింది. ఇది సరఫరా గొలుసులు, ఇంధన ప్రవాహాలపై కొత్త ఆందోళనలు రేకెత్తిస్తోంది. ప్రస్తుతం హొర్ముజ్ జలసంధికి కల్పిస్తున్న అడ్డంకుల కారణంగా నౌకా రవాణాకు విఘాతం ఏర్పడి ప్రపంచ మార్కెట్లు ఒడిదొడుకులను ఎదుర్కొంటుండగా ఇప్పుడు ఇరాన్ పార్లమెంటరీ నాయకత్వం నుంచి ఈ వ్యాఖ్యలు రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ ఎక్స్ వేదికగా పెట్టిన వరుస పోస్టులలో బాబ్ ఎల్‌మండేబ్ జలసంధికి ప్రపంచ వాణిజ్యంలో ఉన్న ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ తదుపరి దీన్ని లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని సంకేతాలు ఇచ్చారు. ప్రపంచ చమురు, ఎల్ఎన్‌జీ, గోధుమలు, బియ్యం, ఎరువుల రవాణాలో ఎంత వాటా బాబ్ ఎల్‌మండేబ్ జల సంధి గుండా వెళుతున్నది? అని ఆయన ప్రశ్నించారు. ఈ జల సంధి గుండా అత్యధిక రవాణా పరిమాణాలను ఏయే దేశాలు, ఏ కంపెనీలు కలిగి ఉన్నాయని కూడా ఆయన ప్రశ్నించారు.

ఇరాక్ పైనా దాడులు

తాజాగా ఇరాన్ భూభాగంలో జరిగిన వైమానిక దాడుల్లో ఒక ఇరాకీ పౌరుడు మరణించడంతో ఇరాక్ ఇరాన్‌తో ఉన్న షాలంచెహ్ సరిహద్దు క్రాసింగ్‌ను మూసివేసినట్లు భద్రతా వర్గాలు శనివారం తెలిపాయి. ఇరాన్ వైపున ఉన్న ప్రయాణికుల వెయిటింగ్ ప్రాంతంపై జరిగిన ఈ దాడుల్లో కనీసం ఐదుగురు ఇరాకీలు తీవ్రంగా గాయపడ్డారని వర్గాలు తెలిపాయి. మరో వైపు ఇరాక్‌లోని ఉత్తర రుమైలా చమురు క్షేత్రంపై డ్రోన్ దాడిలో ముగ్గురు కార్మికులు గాయపడ్డారు. దక్షిణ ఇరాన్‌లోని ఒక సిమెంట్ కర్మాగారంపై శనివారం అమెరికాఇజ్రాయెల్ దాడులు జరిపినట్లు మీడియా పేర్కొంది. ఇరాన్‌లోని బుషెహర్ అణు విద్యుత్ కేంద్రంపై క్షిపణి దాడి జరిగింది. నైరుతి ఇరాన్‌లోని ఒక పెట్రో కెమికల్స్ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని అమెరికాఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఐదుగురు గాయపడ్డారని ఓ అధికారి తెలిపినట్లు ఇరాన్ మీడియా తెలిపింది.

ఫీజు దోపిడీపై ముఖ్యమంత్రి మౌనం ఎందుకు?

మొదటిపేజీ తరువాయి

దోపిడీపై ముఖ్యమంత్రి ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. పేదలు, మధ్య తరగతి ప్రజల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించటం కచ్చితంగా వారిని మోసం చేయటమేనని అన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థలతో లాలూచీ!

ముసాయిదా బిల్లు సిద్ధమైన తర్వాత కూడా భారీ ఎత్తున కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులు పెంచాయని గుర్తు చేశారు. సామాన్య ప్రజలు ఫీజులు చెల్లించలేక ఆగమవుతుంటే ప్రభుత్వం మాత్రం ఈ బిల్లును అటకెక్కించిందని మండిపడ్డారు. కార్పొరేట్ విద్యా సంస్థల లాబీతో ప్రభుత్వానికి లాలూచీ ఏంటనీ ప్రశ్నించారు. వారితో ఏవైనా ఒప్పందాలు ఉన్నాయా? లేదంటే రహస్య అజెండా ఉందా చెప్పాలని నిలదీశారు. ఫీజుల దోపిడీ కారణంగా సామాన్య కుటుంబాల జీవితకాలపు పొదుపు మొత్తం హారతి కర్పూరంలా కరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రేపు సేవ్ సింగరేణి రౌండ్ టేబుల్ సమావేశం

సింగరేణి సంస్థను కాపాడేందుకు తెలంగాణ జాగృతి, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో ఆదివారం సేవ్ సింగరేణి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, వివిద కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటారు. సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహణ, సంస్థకు ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు, అలియాస్ పేర్ల అంశం, కారుణ్య నియామకాలు, సంస్థ మనుగడ కోసం చేపట్టాల్సిన చర్యలను ఈ సమావేశంలో చర్చించనున్నారు.

రసాయన శాస్త్రంలో నాగులంచ భుజంగరావుకు పీహెచ్.డీ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతిపక్షం, ఏప్రిల్ 4 : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి భుజంగరావు నాగులంచ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'RPHPLC, LCMS and QbD విధానాల ద్వారా ఔషధ మోతాదు రూపాలలో జన్యు విష మలినాలు, ఐసోమర్లు, విఘటన ఉత్పత్తులను అంచనా వేయడానికి, స్థిరత్వాన్ని సూచించే పద్ధతుల అభివృద్ధి, ధ్రువీకరణ'పై ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.కోటేశ్వరరావు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఔషధాలలో ఉండే మలినాలను కచ్చితంగా విశ్లేషించడానికి, పటిష్టమైన, నియంత్రణ ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విశ్లేషణా పద్ధతులను అభివృద్ధి చేయడంపై ఈ అధ్యయనం దృష్టి సారించినట్టు తెలియజేశారు. కచ్చితత్వం, సున్నితత్వం, విశ్వసనీయతను నిర్ధారించడానికి ఈ అధ్యయనంలో హెచ్ పి ఎల్ సి , ఎల్సి MSemes2, and LCMS/MS వంటి అధునాతన సాంకేతికతలతో పాటు విశ్లేషణాత్మక రూపకల్పన ద్వారా నాణ్యత (AQbD), ప్రయోగాల రూపకల్పన (DoE)లను కూడా ఉపయోగించినట్టు వివరించారు. ఈ పరిశోధన, బలోక్సావిర్ మార్బాక్సిల్, గ్లిపిజైడ్, క్లోర్ జోక్సాజోన్, అబ్రోసిటినిబ్, సెర్ట్రాలిన్ వంటి కీలక ఔషధాలలో మలినాల విశ్లేషణపై దృష్టి సారించిందని తెలిపారు. ఇది అతి తక్కువ స్థాయిలో ఉండే జన్యు విషపూరిత మలినాలను, విచ్ఛిన్న ఉత్పత్తులను సమర్థవంతంగా గుర్తించడానికి వీలు కల్పించడం ద్వారా, ఔషధ నాణ్యత, భద్రతను మరింత పటిష్టం చేసిందన్నారు. డాక్టర్ భుజంగరావు సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.




లేక్ సిటీ కొనుగోలుదారులకు ఇన్ కార్ భరోసా

- నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు కస్టమర్లతో కలిసి పని చేస్తామని ప్రకటన



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 4: లేక్ సిటీ కొనుగోలుదారుల పట్ల తమ నిబద్ధతను చాటుకుంటూ ఇన్ కార్ సంస్థ వారితో ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించింది. కస్టమర్ల ఆందోళనలను వినడంతో పాటు ప్రాజెక్టు పూర్తి చేయడంపై స్పష్టమైన హామీ ఇవ్వడమే లక్ష్యంగా ఈ భేటీ సాగింది. ఇది కేవలం ఒక అధికారిక సమాచారం లాగా కాకుండా, కొనుగోలుదారుల అంచనాలు మరియు వారి కలల ఇంటిని నిర్మించే లక్ష్యంతో కూడిన చర్చగా సాగింది. నిర్మాణంలో జరుగుతున్న ఆలస్యం వల్ల కొనుగోలుదారులకు కలిగిన ఇబ్బందులను సంస్థ అంగీకరించింది. అయితే లేక్ సిటీ ప్రాజెక్టు తమకు అత్యంత ప్రాధాన్యత కలిగినదని, దీనిని పూర్తి చేయడంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఇన్ కార్ స్పష్టం చేసింది. ప్రాజెక్టును పూర్తి చేయడానికి అవసరమైన బృందాలు, పెట్టుబడి మరియు నిర్మాణ పనులు అన్నీ సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని వివరించింది. ఈ నిబద్ధత క్షేత్రస్థాయిలో ఇప్పటికే కనిపిస్తోందని, టవర్ ఏ మరియు టవర్ బి ల స్ట్రక్చర్ పనులు పూర్తయ్యాయని సంస్థ తెలిపింది. టవర్ ఏ త్వరలోనే హ్యాండోవర్ కు సిద్ధంగా ఉందని, ఇది సంస్థ పెడుతున్న నిరంతర పెట్టుబడికి మరియు పని పట్ల చూపిస్తున్న శ్రద్ధకు నిదర్శనమని పేర్కొంది. అలాగే కస్టమర్ల నుండి సేకరించిన ప్రతి రూపాయిని తిరిగి ఈ ప్రాజెక్టులోనే పెట్టుబడిగా పెట్టామని, నిధులను ఎక్కడా మళ్లించలేదని ఇన్ కార్ స్పష్టం చేసి వారి నమ్మకాన్ని బలపరిచింది. కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల కలిగే ఆందోళనలను తగ్గించడానికి ఇన్ కార్ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. బిల్డర్ మరియు కస్టమర్లు కలిసి పని చేసేలా ఒక జాయింట్ కస్టమర్‌బిల్డర్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ వేదిక ద్వారా ప్రాజెక్టు పురోగతిపై క్రమం తప్పకుండా అప్‌డేట్స్ ఇవ్వడం, స్వతంత్ర క్వాలిటీ ఆడిట్‌లు నిర్వహించడం మరియు నిర్మాణ మైలురాళ్లను స్పష్టంగా తెలియజేయడం వంటివి చేస్తారు. దీనివల్ల ఊహాగానాలకు తావులేకుండా వాస్తవాలు కస్టమర్లకు నేరుగా తెలుస్తాయని సంస్థ భావిస్తోంది. లేక్ సిటీ ప్రాజెక్టు ఆలస్యం కావడానికి గల వివిధ కారణాలను ఈ సమావేశంలో చర్చించారు. ప్రాజెక్టు ప్రారంభంలో కరోనా మహమ్మారి వల్ల ఏర్పడిన అడ్డంకులు, నిబంధనల మార్పులు, మార్కెట్ పరిస్థితులు మరియు తప్పుడు ప్రచారం వంటి అంశాలు నిర్మాణ గమనాన్ని ప్రభావితం చేశాయని సంస్థ వివరించింది. ప్రతికూల ప్రచారం వల్ల కస్టమర్ల విశ్వాసం దెబ్బతినడమే కాకుండా అమ్మకాలు తగ్గి, నిర్మాణానికి అవసరమైన నిధుల సేకరణపై ప్రభావం పడిందని పేర్కొంది. అయినప్పటికీ ఈ సవాళ్లు ఏవీ తమ లక్ష్యాన్ని మార్చలేదని ఇన్ కార్ స్పష్టం చేసింది. ముందుకు సాగడానికి సమష్టి కృషీ అవసరమని కంపెనీ నొక్కి చెప్పింది. కొత్తగా ఏర్పడిన కమిటీ ద్వారా చర్చలు జరపాలని, ఇది సమస్యల పరిష్కారానికి మరియు నిర్మాణ వేగాన్ని పెంచడానికి సరైన మార్గమని కస్టమర్లకు సూచించింది. అందరూ కలిసికట్టుగా బాధ్యతాయుతంగా ముందుకు సాగడం వల్ల ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయవచ్చని తెలిపింది. లేక్ సిటీ అనేది కేవలం ఒక ప్రాజెక్టు మాత్రమే కాదని, ఇదొక దీర్ఘకాలిక విజన్ అని, నాణ్యమైన జీవన ప్రమాణాలతో కూడిన లేక్ సైడ్ టౌన్ షిప్ అని పునరుద్ఘాటించింది. చర్చ ముగిసే సమయానికి వివరణల కంటే భరోసా ఇచ్చేలా కంపెనీ తన వాగ్దానాన్ని చాటి చెప్పింది. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ, నిర్మాణంలో ఆలస్యం వల్ల కస్టమర్ల జీవితాలపై పడే ప్రభావం తమకు తెలుసని, దానిని తాము తేలికగా తీసుకోవడం లేదని అన్నారు. లేక్ సిటీ నిర్మాణానికి తాము కట్టుబడి ఉన్నామని, ఆ మాటను పూర్తిగా నిలబెట్టుకుంటామని హామీ ఇచ్చారు. పారదర్శకతను పెంచడం ద్వారా మరియు కస్టమర్లతో కలిసి పని చేయడం ద్వారా తాము కేవలం ఇళ్లను మాత్రమే కాకుండా, అందరం నమ్మే ఒక గొప్ప విజన్‌ను అందిస్తామనే విశ్వాసం ఉందని ఆయన పేర్కొన్నారు.



సినిమాల్లోని వీఎఫ్ఎక్స్‌ను కనీస అవగాహనతో విమర్శించాలి. మనం ఎన్నడూ చూడని వాటిని రామాయణ, కల్కి, బాహుబలి వంటి సినిమాలతో మేకర్స్ చూపిస్తున్నారు. ఎంతో ఖర్చు చేస్తూ కష్టపడుతున్నారు. వీఎఫ్ఎక్స్‌లో చాలా స్టైల్స్ ఉంటాయి. మేకర్స్ ఎంచుకున్న స్టైల్ మీకు నచ్చకపోవచ్చు. కానీ ఇక నుంచి వీఎఫ్ఎక్స్ కథకు సరిపోయిందా? మేకర్స్ తాము అనుకున్నది చూపించారా అని కూడా ఆలోచించండి.

- బాలివుడ్ హీరో హృతిక్ రోషన్





సీజేఐని కలిసిన సీఎం రేవంత్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్ 4: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శంషాబాద్ హోటల్ నోవాటెల్ లో జస్టిస్ సూర్యకాంత్ గౌరవార్థం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విందుకు సీఎం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్, న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ లో నిర్మించే తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జోన్II భవన నిర్మాణ పనులకు ఆదివారం చేపట్టే శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం సాయంత్రం రాష్ట్రానికి విచ్చేసిన దేశ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్సూర్యకాంత్ ను రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి ఇతర ప్రముఖులు ఘనంగా స్వాగతం పలికారు.

జగ్జీవన్‌రామ్ జీవితం దేశానికి ఆదర్శం

- ఆయన జయంతి సందర్భంగా సేవలను గుర్తు చేసుకున్న సీఎం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్ 4: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధానమంత్రి డా. బాబూ జగ్జీవన్ రామ్ జీవితం దేశానికి ఆదర్శమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు బాబూజీ 119వ జయంతి సందర్భంగా సీఎం ఆయనను గుర్తు చేసుకున్నారు. దళితుల హక్కుల కోసం ఆయన జీవితాంతం పోరాడారని గుర్తుచేశారు. పేదరికంలో పుట్టినా, తన పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదిగారని చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, తొలి ప్రధాని నెహ్రూ మంత్రివర్గంలో మంత్రిగా సేవలందించారని అన్నారు.అణగారిన వర్గాలు, కార్మికుల సంక్షేమం కోసం ఆయన కృషి చేశారని తెలిపారు. కుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారని చెప్పారు.బాబూజీ స్ఫూర్తితోనే తెలంగాణలో ప్రజా పాలన కొనసాగిస్తున్నామని సీఎం అన్నారు. సామాజిక న్యాయం, అన్ని వర్గాల మేలుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దేశానికే ఆదర్శంగా కుల గణన చేపట్టామని, బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.బాబూజీ ఆశయాలే తమకు మార్గదర్శకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

మాదాపూర్‌లో చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్

- రెండు నెలల్లో పూర్తి చేయాలంటూ అధికారులకు ఆదేశం
- పర్యటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలంటూ హితవు
- చెరువుల చెంత ప్రభుత్వ భూములుంటే స్వాధీనానికి సూచనలు



ప్రతిపక్షం, హైదరాబాద్, ఏప్రిల్ 4: మాదాపూర్‌లోని తమ్మిడికుంటతో పాటు సున్నం చెరువులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం పరిశీలించారు. చెరువుల పునరుద్ధరణ పనులు జరుగుతున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించి.. అధికారులతో సమీక్షించారు. రెండు నెలల్లో చెరువుల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకస్మికంగా తమ్మిడికుంటను పరిశీలించిన నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం సందర్శించారు. ఐటీ కేంద్రానికి చేరువుగా ఉన్న తమ్మిడికుంటను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే కాకుండా, ఇక్కడకు వస్తే ఒత్తిడి కూడా దూరమమయ్యేలా అభివృద్ధి చేయాలని సీఎం సూచించిన విషయాన్ని చెరువు అభివృద్ధి పనులు పర్యవేక్షిస్తున్న అధికారులకు కమిషనర్ చెప్పారు. బయట కంటే చెరువు చెంత 3 నుంచి 4 డిగ్రీల ఉష్ణోగ్రతలు తక్కువ ఉండేలా పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. చెరువు చుట్టూ పాత్ వేలు, కూర్చొని సేద దీరేందుకు వీలుగా సీటింగ్ వ్యవస్థ, పార్కులు, పచ్చిక బైళ్లు ఉండేలా చూడాలన్నారు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోండి..

చెరువుల చుట్టూ ఉన్న ప్రభుత్వ భూముల గురించి పూర్తి స్థాయిలో విచారించి, వాటిని స్వాధీనం చేసుకుని చెరువు అభివృద్ధిలో భాగం చేయాలని అధికారులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశించారు. ఆక్రమణదారుల పత్రాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. సున్నం చెరువు చెంత సర్వే నంబరు 30, 31కి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుని, ప్రభుత్వ భూమి ఉంటే అంగుళం కూడా పోకుండా సెక్యూర్ చేయాలన్నారు. తమ్మిడికుంట చెరువుకు పై భాగంలో కింది భాగంలో ఉన్న ప్రభుత్వ భూములను తమదిగా క్లైమ్ చేస్తున్న వారి పత్రాలను పరిశీలించాలన్నారు.

వరద కాలువ సమస్యను పరిష్కరిస్తాం

సున్నం చెరువు చెంతన ఉన్న బోరబండ బస్తీ, ఎన్‌ఆర్‌ఆర్ పురం నుంచి వచ్చే వరద నీరు నేరుగా చెరువులోకి కలిసేలా ఇన్‌లెట్లను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. వరద నీరు చెరువులోకి చేరేలా, మురుగు నీరు కిందకు పోయేలా డైవర్ట్ కాలువ నిర్మాణం కూడా పూర్తయ్యిందని, త్వరలో అనుసంధానం చేయాల్సి ఉందని అధికారులు ఈ సందర్భంగా కమిషనర్‌కు వివరించారు. అయితే ఈ అనుసంధానం జరగకపోవడంతో సున్నం చెరువు రోడ్డు నుంచి బస్తీలోకి వెళ్లే మార్గం ప్రమాదకరంగా మారిందని, ఇక్కడ పైపులైన్లు వేసి మురుగు సాఫీగా సాగేలా చూడాలని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, రెండు రోజుల్లో మున్సిపల్ అధికారులతో కలిసి వచ్చి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

రాజకీయంగా వేధించడానికే ఈ విచారణ

- పొంగులేటి మైనింగ్ స్కామ్ నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే నాపై ఎథిక్స్ కమిటీ
- సీఐడీ విచారణపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్4: ఇటీవల హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని వరుస వివాదాలు చుట్టుముడుతున్న విషయం తెలిసిందే. తాజాగా పోలీసు విధులకు భంగం కలిగించడం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన కేసులో కౌశిక్ రెడ్డి శనివారం సీఐడీ అధికారుల ఎదుట హాజరయ్యారు. ఆయనను ఏసీబీ రంగస్వామి విచారించారు. విచారణ అనంతరం ప్రభుత్వం, పోలీసులపై పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. తనను, తన కుటుంబాన్ని రాజకీయంగా వేధించడానికి ఈ విచారణలు జరుపుతున్నారని ఆరోపించారు. సీఐడీ కార్యాలయం వెలుపల మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, ప్రస్తుత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. 'నేను అనని మాటలు అన్నట్లుగా చిత్రీకరిస్తున్నారు. పొంగులేటి మైనింగ్ స్కామ్ నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే నాపై ఎథిక్స్ కమిటీ వేశారు. ప్రజల పక్షాన పోరాడటానికి నేను దేనికైనా సిద్ధం. హుజూరాబాద్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటును ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. కరీంనగర్ జిల్లా చెత్తనంతా తెచ్చి హుజూరాబాద్‌లో వేస్తే ఊరుకోం. ఆ డంపింగ్ యార్డ్ కరోనా కంటే ప్రమాదం. ఈ విషయంలో నేను చేస్తున్న పోరాటాన్ని అణచివేయడానికి విచారణ పేరుతో అడ్డుకుంటున్నారు. ఈ నెల 7వ తేదీన హుజూరాబాద్‌లో దీక్షకు కూర్చుంటా. నేను మత మార్పిడిలపై వ్యాఖ్యలు చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా' అని అన్నారు

ఓర్వలేక అసత్యాలను వల్లే వేస్తున్న కిషన్ రెడ్డి

- గ్యారంటీల అమలుపై కిషన్ రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదం
- టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్4 : ఆరు గ్యారంటీల అమలు పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ అన్నారు. ఎన్నికలకు ముందు సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఒక్కటిగా అమలు చేస్తూ పరిపాలనలో దూసుకుపోతుంటే ప్రజల్లో సీఎం రేవంత్ రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కిషన్ రెడ్డి అసత్యాలను వల్లే వేస్తున్నారన్నారు. కళ్లు ఉండి కూడా చూడలేని కబోదిగా కిషన్ రెడ్డి మాట్లాడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమల్లో భాగంగా విడుతలవారీగా రైతు రుణమాఫీ యాభై లక్షల గృహాలకు రెండు వందల యూనిట్లు ఉచిత విద్యుత్, మహిళ సోదరీమణులకు ఉచిత బస్సు ప్రయాణం, ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ పథకం, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, దాదాపు అరవై వేల ఉద్యోగ కల్పన ఇవన్నీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేసినవి కావా? అని కిషన్ రెడ్డి ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. తెలంగాణలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నాం కాబట్టే ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిపే సీఎం రేవంత్ పనితనానికి నిదర్శనం అని గుర్తుంచుకోవాలన్నారు. గత పదకొండు సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఏపాటిగా అమలు చేశారొ చెప్పాలన్నారు. జన్ దన్ ఖాతాల్లో పదిహేను లక్షల రూపాయలు వేస్తామని చెప్పి ఎందుకు వేయలేదో కిషన్ రెడ్డి జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం నిరుద్యోగులకు ఇస్తామన్న కోటి ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేదో నిరుద్యోగులకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కిషన్ రెడ్డికి లేదా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కేరళలో మీరెన్ని సర్కస్ ఫీట్లు చేసిన బిజెపికి డిపాజిట్లు కూడా రావని బండి సుధాకర్ పేర్కొన్నారు.



రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చుతున్నారు

- రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నట్లా?
- దాడులకు భయపడుతమా?
- టీఎస్ఐఐసీ మాజీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్ 4: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, గజ్వేల్ శాసనసభ్యులు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని టీఎస్ఐఐసీ మాజీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు అన్నారు. ప్రజా రాజ్యం, ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటూ కాలం గడుపుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చుతున్నాడన్నారు. ప్రధాన ప్రతిపక్ష నేత క్యాంపు కార్యాలయంపైనే దాడులు జరుగుతున్నాయంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నట్లా? ఉంటే అవి అమలవుతున్నాయా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయనీ మండిపడ్డారు. పోలీసులు ప్రజలకు, ప్రజల ఆస్తులకు కాపాలా ఉండాల్సింది పోయి, అధికార కాంగ్రెస్ నాయకులకు కొమ్ముకాయడం విడ్డూరంగా ఉందన్నారు. అల్లరి మూకలు ప్రజా ఆస్తులపై తమ ప్రతాపం చూపెడుతా ఉంటే పోలీసులు ఎందుకు చోద్యం చూస్తున్నారో అర్థం కావడం లేదనీ విమర్శించారు. అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదు, అలా అనుకుంటే కాంగ్రెస్ నాయకుల కన్నా తెలివిలేని, అజ్ఞానపు నాయకులు వేరే ఎవరుండరనే విషయం వాళ్లు తెలుసుకుంటే మంచిదని సూచించారు. ఇలాంటి ఎన్నో దాడులను, ఎన్నో అవమానాలను ఎదుర్కొన్న ఘనత మా నాయకుడిదనీ, అంతేకానీ మీ దాడులకు భయపడి వెనకకుపోతామనుకుంటే మీ అవివేకమే అవుతుందన్నారు. మీరెన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల కోసం పోరాడటంలో వెనక్కి తగ్గేది లేదనీ ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. రానున్నకాలంలో కాంగ్రెస్ నాయకులు ఇంతకు రెట్టింతలు అనుభవిస్తారని దుయ్యబట్టారు.



కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల పార్టీ

- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- ఆదిలాబాద్ నూతన కార్యవర్గ సమావేశం
- నియామక పత్రాలు అంంజేత

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్4: కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల పార్టీ అని ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల పార్టీ అని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ డీసీసీలుగా ఆదివాసీ గిరిజనులను నియమించడమే దీనికి నిదర్శనమని అన్నారు. ఇటీవల నియమించిన ఆదిలాబాద్‌కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గ సభ్యులు, అధికార ప్రతినిధుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులందరికీ నియామక పత్రాలు అందించి వారితో ప్రమాణం చేయించారు. నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. తదనంతరం మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో నూతన పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు, ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మాద రాజకీయాలను అడుగడుగునా నిలువరించాలని, గత పది సంవత్సరాలుగా రాముడి పేరుతో ప్రజలను రెచ్చగొట్టి ఓట్లు దండుకొని దేశాన్ని అంబానీ, ఆదాని లాంటి కార్పొరేట్లకు కట్ట పెట్టడం తప్ప పేద ప్రజలకు బీజేపీ చేసింది ఏమీ లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ సచిన్ సావంత్, ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, మాజీ ఎంపీ వేణుగోపాల చారి, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి, బోథ్ నియోజకవర్గా ఇన్చార్జ్ ఆడే గజేంద్ర, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ శ్యామ్ నాయక్, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అను సతీష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య, టీపీసీసీ మాజీ జనరల్ సెక్రెటరీ గండ్రత్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

సహజ మరణానికి కూడా 10 లక్షల బీమా

- సింగరేణి యాజమాన్యం చొరవతో యూనియన్ బ్యాంక్ నిర్ణయం
- ఈ నెల 1 నుండి అమలు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్4: ఇప్పటివరకు సింగరేణిలో కోటి రూపాయల ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్న యూనియన్ బ్యాంక్ సింగరేణి యాజమాన్యం చేసిన సూచనల మేరకు సహజ మరణం చెందిన కార్మికులకు కూడా ఉచిత బీమా సౌకర్యాన్ని కల్పించాలని నిర్ణయించింది. యూనియన్ బ్యాంకులో కార్పొరేట్ శాలరీ అకౌంటు కలిగి ఉన్న కార్మికులు లేదా అధికారులు ఎవరైనా సరే మృతి చెందినట్లయితే వారికి పది లక్షల రూపాయల బీమా సౌకర్యాన్ని వర్తింప జేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సింగరేణి సంస్థకు బ్యాంకు యాజమాన్యం తెలియజేసింది. సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు డైరెక్టర్ పర్సనల్, ఫైనాన్సు గౌతమ్ పోట్రు ప్రత్యేక చొరవ ఫలితంగా యూనియన్ బ్యాంకు యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇది అమలులోకి రానున్నట్లు బ్యాంకు యాజమాన్యం పేర్కొంది. 2024లో రాష్ట్ర ప్రభుత్వం చొరవతో సింగరేణి కార్మికులకు ఉచిత కోటి రూపాయల ప్రమాద బీమా పథకాన్ని యూనియన్ బ్యాంకు అమలు జరిపింది. ఈ ఒప్పందానికి కొనసాగింపుగా సహజ మరణానికి కూడా 10 లక్షల రూపాయల బీమాను వర్తింపజేస్తూ నిర్ణయించినట్లు యూనియన్ బ్యాంకు అధికారులు పేర్కొన్నారు.



తెలంగాణ గడ్డపై మరో రాజకీయ పార్టీ

- కప్పటి పాండురంగారెడ్డి
- శంకర్ పల్లిలో ఘనంగా రాజకీయ పార్టీ ఆవిర్భావ ప్రకటన పోస్టర్ విడుదల

ప్రతిపక్షం, మహేశ్వరం, ఏప్రిల్ 4: తెలంగాణ గడ్డపై మరో రాజకీయ ఉద్యమానికి నాంది పలుకుతూ, ఈనెల 25న ప్రకటించనున్న కొత్త రాజకీయ పార్టీ ఏర్పాట్లపై శంకర్ పల్లి మండల కేంద్రంలో భారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. కొలాన్ కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామిడి వెంకట్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు కె.శివశంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ ఆవిర్భావ ప్రకటన పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ ఆశయాల ప్రతిరూపం నూతన పార్టీ సమావేశం అనంతరం కప్పాటి పాండురంగా రెడ్డి, రామిడి వెంకట్ రెడ్డి సంయుక్తంగా విలేఖరులతో మాట్లాడారు. తెలంగాణలోని సబ్బండ వర్గాల అభివృద్ధి, సామాజిక న్యాయమే లక్ష్యంగా, తెలంగాణ అస్తిత్వంతో ఈ పార్టీ పురుడుపోసుకోబోతోంది. తెలంగాణ ప్రజా గొంతుక కవితక్క నాయకత్వంలో ఈ పార్టీ ప్రజల మద్దతుతో తిరుగులేని శక్తిగా ఎదగడం ఖాయం అనీ దీవ వ్యక్తం చేసారు. రాష్ట్ర ప్రభుత్వంతో ప్రతిపక్ష పార్టీలు కుమ్మక్కయ్యాయని, ప్రస్తుతం ఈ ప్రభుత్వంపై కవితక్క మాత్రమే ఒంటరి పోరాటం చేస్తున్నారని వారు ధ్వజమెత్తారు. మహిళల చేతుల్లోనే రాష్ట్ర భవిష్యత్తు ఇది కేవలం ఒక రాజకీయ పార్టీ కాదని, ఇదొక మార్పు, ఒక గొప్ప ఉద్యమమని నాయకులు అభివర్ణించారు. "ఇన్నాళ్లూ 'అవకాశం ఇవ్వలేదు' అని బాధపడిన రోజులు పోయాయి, ఇకపై 'అవకాశం తీసుకుంటాం' అని గర్జించే సమయం వచ్చింది. ఇంటి బాధ్యతలను మోసే ఆడబిడ్డ రాష్ట్రాన్ని కూడా అదే నిబద్ధతతో నడిపించగలదు. ఒక ఆడబిడ్డ ముందుకు వస్తే ఒక కుటుంబం మారుతుంది, వేలాది మంది ఆడబిడ్డలు కదిలితే రాష్ట్రం మారుతుంది. ఇది మహిళల కోసం, మహిళల చేతుల్లో మొదలవుతున్న నూతన రాజకీయపార్టీ. ఈనెల 25వ తేదీన మేడ్చల్, మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్ లో జరిగే నూతన రాజకీయ పార్టీ ప్రకటన సభను విజయవంతం చేయాలని వారు కోరారు. తెలంగాణ యువత, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి కవితక్క నాయకత్వాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు. పాల్గొన్న నాయకులు: ఈ కార్యక్రమంలో జి.ప్రశాంత్ గౌడ్, సయ్యద్ ఇల్యాస్, నరేష్ గౌడ్, అనుదీప్ రెడ్డి, శ్రీకాంత్, కిషోర్, భాస్కర్ రెడ్డి, మణిదీప్, మనీ, చింటూ, ఎత్తరి గణేష్, గౌతమ్ రెడ్డి, వంశీ, గిరి, శెట్టి రాజు, రాయగంటి జగన్ పాల్గొన్నారు

ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 174 అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ


- సెలక్షన్ లిస్టును విడుదల చేసిన రిక్రూట్‌మెంట్ బోర్డు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఏప్రిల్4: ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 174 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సంబంధించిన సెలక్షన్ లిస్టును మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డు శనివారం సాయంత్రం విడుదల చేసింది. గైనకాలజీ, అనస్తీషియా, పీడియాట్రిక్, ఆర్థోపెడిక్స్ విభాగాల్లో పోస్టులకు ఎంపికైన వారి జాబితాను ప్రకటించింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని వివిధ స్పెషాలిటీ డిపార్ట్‌మెంట్లలో ఖాళీగా ఉన్న 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి గతేడాది చివరలో బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో గైనకాలజీ, అనస్తేషియా, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ స్పెషాలిటీలకు సంబంధించిన 174 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తవడంతో, ఉద్యోగాలకు ఎంపికైన వారి తుది జాబితాను శనివారం విడుదల చేసింది. వీరికి ఈ నెల 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలు అందజేయనున్నారు. మిగిలిన 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రక్రియను మరో నెల రోజుల్లో పూర్తి చేయనున్నారు.

భారీ ఎత్తున ఖాళీలు భర్తీ

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు సహా అన్నిరకాల పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టింది. గడిచిన రెండున్న సంవత్సరాల్లో సుమారు 9,572 పోస్టులను భర్తీ చేసింది. మరో 7,562 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతుండగా, అందులో 174 పోస్టుల భర్తీ ప్రక్రియ నేటితో ముగిసింది. మరో 692 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్) పోస్టులకు సంబంధించిన తుది ఫలితాలను ఒకట్రెండు రోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది. అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటుగా, ఈ 692 పోస్టులకు ఎంపికైన డాక్టర్లకు కూడా ఈ నెల 7న మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందించే అవకాశం ఉంది. అలాగే, మరో వారం రోజుల్లో 2312 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల ఫలితాలను కూడా విడుదల చేస్తామని మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డు ప్రకటించింది.





బెంగాల్‌ఎన్నికల్లో తమకు ఓటు వేసేందుకు బీజేపీ బిహార్ ఓటర్లను తరలిస్తోంది. వీరికి 2 చోట్లా ఓట్లున్నాయి. బిహార్ ఎన్నికల్లోనూ హరియాణా వారితో ఓట్లేయించారు. దానికోసం రైళ్లు నడిపారు. ఛత్‌పూజ కోసం అని రైల్వే బుకాయించింది కానీ అది నిజం కాదు. ఈసీ అండగా ఉండబట్టే బీజేపీ ఆత్మనిర్భరత అంటోంది.

- ఎంపీ కపిల్ సిబల్

ఓపెన్ వాయిస్

ఎగుమతులకు యుద్ధం సెగ

పశ్చిమాసియా యుద్ధ బీభత్సం అంతర్జాతీయ సరఫరా గొలుసులను చిన్నాభిన్నం చేసి చమురు, గ్యాస్ ఇతర కీలక అవసరాలు ఎవరికీ అందకుండా ఎంత కల్లోలం సృష్టిస్తోందో తెలిసిందే. భారతదేశం నుంచి ఇతర దేశాలకు ఎగుమతి కావలసినవి కాకుండా ఆటంకాలు ఏర్పడి ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ నుంచి అమెరికా, యుఎఇ, సౌదీ అరేబియా, తదితర దేశాలకు ఎగుమతులు స్తంభించిపోతున్నాయి. దీంతో ఎగుమతిదారులకు ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. ఇతర దేశాలతో ముడిపడి ఉన్న మార్కెట్ వ్యవస్థ తలకిందులవుతోంది. తెలంగాణ నుంచి ఇతర దేశాలకు సంబంధించి మొత్తం పది ప్రధాన ఎగుమతి గమ్యస్థానాలలో అయిదు ప్రస్తుతం గందరగోళానికి గురవుతున్నాయి. అమెరికా, సౌదీ అరేబియా, కువైట్, బంగ్లాదేశ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలకు ఇప్పుడు తెలంగాణ నుంచి కీలకమైన పరికరాలు ఎగుమతికాక స్తంభించిపోతున్నాయి ఎగుమతి మార్కెట్లలో 50% ఈ విదేశీ మార్కెట్లపై నిమగ్నమై ఉంటున్నాయి. అత్యధికంగా ఎగుమతి జరిగే ప్రధాన దేశాల్లో అమెరికా 23.64 శాతం, యుఎఇ 11.74 శాతం, సౌదీ అరేబియా 6.74 శాతం వరకు ఎగుమతి వాణిజ్యంలో పాలుపంచుకుంటున్నాయి. ఇంకా చైనా 3.69 శాతం, ఫ్రాన్స్ 3.38 శాతం, బ్రిటన్ 2.72 శాతం, టర్కీ 2.32 శాతం, జెక్ రిపబ్లిక్ 1.95 శాతం, బంగ్లాదేశ్ 1.83 శాతం, కువైట్ 1.75 శాతం వరకు తెలంగాణతో వాణిజ్యం సాగిస్తున్నాయి. ఇప్పుడు ఈ దేశాలన్నీ యుద్ధ సంక్షోభంతో వాణిజ్య ఒప్పందాల్లో అనిశ్చితిని ఎదుర్కొంటున్నాయి. ఇంతవరకు ప్రతికూలతలు ఉన్నప్పటికీ, తెలంగాణ ఎగుమతుల పనితీరు పటిష్టంగానే సాగింది. 2023 24లో రూ. 1,16,182 కోట్ల విలువైన సరకుల ఎగుమతులు జరగ్గా, 202425లో రూ. 1,61,843 కోట్ల విలువైన ఎగుమతులు జరిగి 39.3 శాతం ఆధిక్యాన్ని చూపించాయి. ఎయిర్ క్రాఫ్ట్, స్పేస్‌క్రాఫ్ట్ విడిభాగాలు, ఫార్మాక్యూటికల్ ఉత్పత్తులు, ఆర్గానిక్ కెమికల్స్, ఎలక్ట్రిక్, ఇంజినీరింగ్ పరికరాలు తదితర ఎగుమతులు విరివిగా జరిగాయి. మరిన్ని కనుగొనండి ఎడిటోరియల్ విశ్లేషణ ఎయిర్ పోర్ట్ సేవలు పిల్లల పుస్తకాలు దీంతోపాటు వ్యవసాయ ఉత్పత్తులు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు చెప్పుకోదగిన విధంగా ఎగుమతులు అవుతున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి 500 రిజిస్టర్డ్ ఎగుమతిదారులు తెలంగాణలో ఉన్నారు. అయినప్పటికీ ప్రస్తుత సంక్షోభంతో గల్ఫ్‌దేశాలకు, ఇతర దేశాలకు ఎగుమతులు తగ్గుముఖం పడుతున్నాయి. వాణిజ్య ఒప్పందాలు ఇంకా ఖరారు కాకపోవడమే ప్రధాన కారణంగా అగ్రికల్చరల్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎపిఇడిఎ) వెల్లడించడం గమనార్హం. నీతి ఆయోగ్ ఎక్స్‌పోర్టు సన్నాహక సూచిక 2024 ప్రకారం ఎగుమతుల్లో అన్ని రాష్ట్రాల కన్నా మొత్తం మీద తెలంగాణ ఎనిమిదో స్థానం వహించింది. లాజిస్టిక్స్ అండ్ సేఫ్టీ 2024 రిపోర్టు ప్రకారం తెలంగాణ ఎచీవర్స్ కేటగిరీలో ఉంది. అయితే రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో తీవ్ర అస్థిరతకు దారితీస్తోందని ఎగుమతిదారులు చెబుతున్నారు. తలకు మించిన భారంతో యూరప్ మీదుగా గల్ఫ్‌దేశాలకు నౌకల ద్వారా రవాణా చేస్తుండడం తమకు కష్టం అవుతోందని కొందరు చెబుతున్నారు. పశ్చిమాసియాలో సాధారణ పరిస్థితి ఏర్పడితేనే కానీ తమకు వెసులుబాటు లభించదని అంటున్నారు. ఇతర ఎగుమతిదారులు విమాన రవాణా ఛార్జీలు భరించలేక పోవడంతో ఇప్పుడు తమకు ఎగుమతి ఆర్డర్లు ఎక్కువగానే వస్తున్నాయని పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలకు నిర్బంధం ఉండడంతో ఇతర విభాగాలపై కూడా ఈ ప్రభావం కనిపిస్తోంది. దుబాయ్, సౌదీ అరేబియా, కువైట్ దేశాలకు ఎగ్ పౌడర్, ఫ్రోజెన్ ఎగ్ లిక్విడ్ ఎగుమతి చేయడానికి ఇదివరకటిలా నౌకలు లభించడం లేదని దాంతో రవాణా ఛార్జీల భారం పెరిగిపోతోందని కొందరు ఎగుమతిదారులు ఆందోళన వెలిబుచ్చారు. హైదరాబాద్ కేంద్రంగా చాక్లెట్‌లు రవాణా చేసేవారు తమకు గతం కన్నా ఆర్డర్లు తగ్గాయని చెప్పారు. మరిన్ని కనుగొనండి వార్తల సబ్‌స్క్రిప్షన్ ఆధ్యాత్మిక కంటెంట్ స్థానిక పర్యాటక ప్యాకేజీలు ఇక పెట్రోలు నుంచి వెలువడే ఉప ఉత్పత్తులతో రసాయనాలు, ఎరువులు తయారు చేసే సంస్థలు తగిన ఉత్పత్తి చేయలేక మూతపడుతున్నాయి. ఫార్మాక్యూటికల్, సెమీకండక్టర్లు, డిటెర్జెంట్, రంగులు, ప్లాస్టిక్స్ వంటి ఉత్పత్తుల తయారీకి కూడా ఆటంకం ఏర్పడుతోంది. ఇంధనం కొరతతో సూరత్ లోని వస్త్రాల తయారీ యూనిట్లు వారానికి ఐదు రోజులే పనిచేస్తున్నాయి. గుజరాత్ లోని సిరామిక్ హబ్‌గా ఉన్న మోర్బీలో మూడింట ఐదు వంతుల మంది కార్మికులు తమ పనులు సాగక ఇళ్లకు తిరిగి వచ్చేస్తున్నారు. సిరామిక్ బట్టీలను మండించడానికి ఉపయోగించే ప్రొపేన్ కొరతగా ఉండడమే దీనికి కారణంగా దీనికి కారణం. ఎల్‌పిజి గ్యాస్ లేక పెద్దపెద్ద రెస్టారెంట్లు, హోటళ్లు మూతపడుతుండడం ప్రతిచోటా చూస్తున్నదే. గ్యాస్ సిలిండర్లకు వాస్తవానికి కొరత లేదని, అనవసరంగా ఆందోళనతో బారులు తీరి నిరీక్షించనక్కర లేదని ప్రభుత్వం ఎంత గట్టిగా చెబుతున్నా కృత్రిమ కొరత తప్పడం లేదు. బ్లాక్‌మార్కెట్‌లో అసలు ధరకు మూడింతలు ఎక్కువ చేసి విక్రయించడం పరిపాటి అవుతోంది. యుద్ధం మరికొన్ని వారాలు కొనసాగితే పరిస్థితి ఇంకా దారుణంగా మారుతుంది. అప్పుడు రేషనింగ్ చివరి మార్గం కావచ్చు. కొవిడ్ మహమ్మారిలా నిజంగానే అలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైతే ప్రపంచ దేశాలు ఒకరికి మరొకరు సహకరించుకోవడం, నిల్వలు అధికంగా ఉన్నవారు తోటి వారికి పంపిణీ చేయడం వంటి సమష్టి కార్యాచరణ పాటించక తప్పదు.

హైదరాబాద్
ఆదివారం
05.04.2026

జనగణన జాప్యం.! ప్రజాస్వామ్య అస్తిత్వానికి పరీక్షా సమయం



వెంక గారి భూమయ్య
9848559863

భారతదేశం వంటి మహా దేశంలో 'జనగణన' (Census) అనేది కేవలం పౌరుల తలల లెక్కింపు కాదు; అది దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ గమనాన్ని నిర్దేశించే ఒక పవిత్రమైన గణాంక యజ్ఞం. 1881 నుండి ప్రతి పదేళ్లకోసారి క్రమం తప్పకుండా జరుగుతున్న ఈ ప్రక్రియకు 2021లో మొదటిసారి బ్రేక్ పడింది. కరోనా మహమ్మారిని సాకుగా చూపి వాయిదా వేస్తూ వచ్చిన పాలకులు, ఎట్టకేలకు 2026 ఏప్రిల్ నుండి ఈ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. అయితే, ఈ ఐదేళ్ల సుదీర్ఘ జాప్యం వెనుక ఉన్న రాజకీయ మర్మం ఏమిటి? ఈ నూతన జనగణన దేశ సమగ్రతకు దిక్సూచిగా మారుతుందా లేక విభజన రేఖలను మరింత లోతుగా గీస్తుందా? అన్నది ఇప్పుడు మిగిలి ఉన్న మిలియన్ డాలర్ల ప్రశ్న.

గణాంకాలు లేని పాలన.. చీకట్లో ప్రయాణం

గత పదేళ్లుగా దేశం పాతబడిన 2011 గణాంకాలతోనే నెట్టుకొస్తోంది. ఈ పద్నాలుగేళ్ల కాలంలో దేశ జనాభా స్వరూపం పూర్తిగా మారిపోయింది. కోట్లాది మంది కొత్తగా ఓటర్లయ్యారు, లక్షలాది మంది వలస వెళ్లారు, మరెంతో మంది పేదరికం నుండి బయటపడ్డారు లేదా కొత్తగా పేదరికంలోకి నెట్టబడ్డారు. ఖచ్చితమైన డేటా లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలు అసలైన లబ్ధిదారులకు చేరుతున్నాయా లేదా అన్నది సందేహమే. జాతీయ ఆహార భద్రతా చట్టం వంటి కీలక పథకాలు నేటికీ పాత లెక్కల ఆధారంగానే నడుస్తుండటంతో, సుమారు 10 నుండి 15 కోట్ల మంది అర్హులు రేషన్ కార్డులకు దూరమయ్యారనేది చేదు నిజం. డేటా లేకపోవడం అంటే పౌరుడి హక్కులను కాలరాయడమే.

డిజిటల్ జనగణన..
నిఘా రాజ్యానికి పునాదా?

ఈసారి ప్రభుత్వం 'డిజిటల్ జనగణన' అనే నినాదంతో ముందుకు వస్తోంది. కాగితం రహితంగా, మొబైల్ యాప్‌ల ద్వారా సమాచారాన్ని సేకరించడం సాంకేతికంగా మెచ్చుకోదగినదే. కానీ, ఈ డేటా భద్రతపై నీలినీడలు ముసురుతున్నాయి. వ్యక్తిగత వివరాలను ఆధార్‌తో అనుసంధానించడం ద్వారా పౌరుల ప్రతి కదలికను పర్యవేక్షించే 'నిఘా రాజ్యం' (Surveillance State) వైపు అడుగులు పడుతున్నాయా అన్న ఆందోళన మేధావుల్లో ఉంది. సమాచార గోప్యతకు చట్టబద్ధమైన గ్యారెంటీ లేని పక్షంలో, ఈ డిజిటల్ డేటా రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం అయ్యే ప్రమాదం లేకపోలేదు.

కుల గణన.. తప్పించుకోలేని సత్యం

ఈ దఫా జనగణనలో 'కుల గణన' (Caste Census) అనేది అత్యంత కీలకమైన మరియు వివాదాస్పదమైన అంశం. భారతదేశంలో సామాజిక అసమానతలు కులం చుట్టూనే తిరుగుతాయి. వందేళ్ల క్రితం నాటి లెక్కలతో నేటికీ రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు అమలు చేయడం శాస్త్రీయత అనిపించుకోదు. "ఎవరి జనాభా ఎంతో, వారికి అంత వాటా దక్కాలి" అనే డిమాండ్ గల్లీ నుండి ఢిల్లీ వరకు వినిపిస్తోంది. అయితే, కుల గణనను అంగీకరించడం పాలకులకు ఒక ముళ్లకంచె లాంటిది. ఈ లెక్కలు బయటకు వస్తే దశాబ్దాలుగా అధికారాన్ని, సంపదను అనుభవిస్తున్న కొన్ని వర్గాల ఆధిపత్యం దెబ్బతినే అవకాశం ఉంది. అందుకే, కుల గణన విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న అస్పష్టత సామాజిక న్యాయం పట్ల వారికున్న చిత్తశుద్ధిని



ప్రశ్నిస్తోంది.

నియోజకవర్గాల పునర్విభజన..
దక్షిణాదిపై రాజకీయ కత్తిపోటు

రాబోయే జనగణన ముగిసిన తర్వాత జరగబోయే 'డిలిమిటేషన్' (నియోజకవర్గాల పునర్విభజన) దేశ ఫెడరల్ స్ఫూర్తికి ఒక అగ్నిపరీక్ష. జనాభా ప్రాతిపదికన పార్లమెంటు సీట్లు కేటాయిస్తే, జనాభా నియంత్రణను తు.చ. తప్పకుండా పాటించిన దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోతాయి. అభివృద్ధికి బహుమతి ఇవ్వాల్సింది పోయి, సీట్లు తగ్గించి శిక్షించడం ఏ రకమైన ప్రజాస్వామ్యం? ఉత్తరాది రాష్ట్రాల్లో పెరుగుతున్న జనాభా కారణంగా అక్కడ సీట్లు పెరిగితే, దేశ సార్వభౌమాధికారం ఒకే ప్రాంతం చేతుల్లో కేంద్రీకృతమయ్యే ప్రమాదం ఉంది. ఇది భవిష్యత్తులో ఉత్తర దక్షిణ విభేదాలకు ఆజ్యం పోసే అవకాశం ఉంది.

మహిళా రిజర్వేషన్ల ప్రహసనం

చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేసినా, దానికి 'జనగణన తర్వాతే అమలు' అనే షరతు విధించడం పాలకుల ద్వంద్వ నీతిని ఎండగడుతోంది. నిజంగా మహిళా సాధికారతపై గౌరవం ఉంటే తక్షణమే అమలు చేయవచ్చు. కానీ జనగణన పేరుతో దాన్ని దశాబ్దాల పాటు వాయిదా వేయడం మహిళా లోకాన్ని వంచించడమే. 2027 లెక్కల కోసం నిరీక్షించడం అంటే మహిళా హక్కులను కోల్డ్ స్టోరేజీలో పెట్టడమే. జనగణన అనేది కేవలం గణాంకాల సేకరణ కాదు, అది దేశ పునర్నిర్మాణానికి ఒక బ్లూప్రింట్. పారదర్శకత లేని జనగణన, కులాల వాస్తవాలు లేని సమాచారం, ప్రాంతీయ అసమానతలను పెంచే విభజనలు దేశానికి శ్రేయస్కరం కాదు. ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం కాకుండా, సామాజిక వాస్తవాలను వెలికితీయడానికి ఈ ప్రక్రియను వాడాలి. డేటా పట్ల పౌరుల్లో నమ్మకం కలిగించాలి. అప్పుడే ఈ 'జనగణన 2026 27' అనేది భారతదేశ సర్వతోముఖాభివృద్ధికి నిజమైన పునాదిగా మారుతుంది. లేదంటే, ఇది కేవలం అధికార పీఠాన్ని భద్రపరుచుకునే మరో రాజకీయ ఎత్తుగడగానే మిగిలిపోతుంది.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

జన నాయకుడు జగ్జీవన్ రామ్



అర్షం జనార్ధన్
9908694980

భారత స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని, దేశ పునర్నిర్మాణం కోసం, దళితుల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన ప్రజా నాయకుడు బాబు జగ్జీవన్ రామ్ (బాబూజీ). ఇతడు బీహార్ భోజ్పూర్ జిల్లా చాంద్వాడ గ్రామంలో 1908 ఏప్రిల్ 5న శోభిరామ్, వాసంతిదేవి దంపతులకు జన్మించాడు. ఇతనికి ఒక అన్న సంతులాల్, ముగ్గురు అక్కచెల్లెళ్ళు ఉండేవారు.

విద్యాభ్యాసం:

ప్రాథమిక విద్య బీహార్ లోనే ప్రారంభించి, అర్ర టౌన్ స్కూల్ నుండి మెట్రిక్యులేషన్ మొదటి విభాగంలో ఉత్తీర్ణుడయ్యాడు. ఉన్నత విద్యను బెనారస్ హిందూ యూనివర్సిటీ నుండి ఇంటర్ సైన్స్ పరీక్షను మరియు కలకత్తా యూనివర్సిటీలో పూర్తిచేసి డిగ్రీ పట్టా అందుకున్నాడు. యూనివర్సిటీలోనే విద్యార్థి నాయకుడిగా, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి విద్యార్థులను ఉద్యమాల ద్వారా చైతన్యవంతం చేయడంలో సఫలీకృతుడయ్యాడు.

ఉద్యమాలు:

మహాత్మా గాంధీ ప్రారంభించిన సివిల్ డిస్‌ఒబిడియన్స్ క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని బ్రిటిష్ వారి చట్టాలకు వ్యతిరేకంగా నిరసనలు తెలియజేస్తూ ప్రజల్లో జాతీయ చైతన్యం పెంపొందిస్తూ ముందుకు నడిచారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని బ్రిటిష్ పాలనను వెంటనే ముగించాలని డిమాండ్ చేయడం వల్ల జగ్జీవన్ రామ్ ను బ్రిటిష్ వారు జైల్లో బంధించారు. ఇవే కాకుండా దళిత ఉద్యమాలు, విద్య, ఉపాధి కోసం కూడా ఉద్యమాలు నడిపించారు.

రాజకీయ జీవితం:

విద్యార్థి దశ నుంచి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ లో పని చేస్తూ 1935 లో అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించి మంచి నాయకుడిగా పేరు పొందారు. 1946 లో జవహర్లాల్ నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో అతిపిన్న వయసులో కార్మిక మంత్రిగా బాధ్యతలు చేపట్టాడు. భారతదేశపు మొట్టమొదటి క్యాబినెట్లో కార్మిక మంత్రిగా, భారత రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా ఉండి సామాజిక న్యాయం రాజ్యాంగంలో పొందుపరచబడిందని నిర్ధారించాడు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రిజర్వేషన్లను ప్రవేశపెట్టిన సమయంలో బాబు జగ్జీవన్ రావు సుముఖం వ్యక్తం చేశారు. బీహార్ ముఖ్యమంత్రిగా దేశ రక్షణ మంత్రిగా వ్యవసాయ శాఖ మంత్రిగా కార్మిక శాఖ మంత్రిగా 1936 నుండి 1986 వరకు 50 సంవత్సరాలు పార్లమెంటు సభ్యునిగా ఓటమెరుగని నాయకుడిగా గుర్తింపు పొందారు. 1969లో కాంగ్రెస్ పార్టీ చీలి పోయినప్పుడు జగ్జీవన్ రామ్ ఇందిరాగాంధీ నాయకత్వంలోని



శిబిరంలో చేరాడు. ఆ విభాగానికి అధ్యక్షుడు అయ్యాడు. 1971లో ఇండో పాకిస్తాన్ యుద్ధం జరుగుతున్నప్పుడు రక్షణశాఖ మంత్రిగా కీలక పాత్రను పోషించాడు. ఫలితంగా బంగ్లాదేశ్ ఏర్పాటుకు సుగమం ఏర్పడింది 1981 లో భారత జాతీయ కాంగ్రెస్ (జె) ను స్థాపించాడు. 1952 నుండి 1986 వరకు పార్లమెంట్ సభ్యుడిగా సేవలు అందించాడు.

రాజకీయ రికార్డులు:

1936 నుండి 1986 వరకు సుమారు 50 ఏళ్ల పాటు నిరంతరాయంగా పార్లమెంటు సభ్యుడిగా గెలిచి ప్రపంచ రికార్డు సృష్టించారు. అత్యధిక కాలం (సుమారు 30 ఏళ్లు) కేంద్ర మంత్రిగా పనిచేసిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. 1977 1979 మధ్య మొరార్జీ దేశాయ్ ప్రభుత్వంలో భారత ఉప ప్రధానిగా బాధ్యతలు నిర్వహించారు. అంతేకాకుండా తొలి కార్మిక మంత్రిగా పారిశ్రామిక రంగంలో ఎన్నో సంస్కరణలు తెచ్చారు. అలాగే వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు దేశంలో 'హరిత విప్లవం' విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించి, భారతదేశాన్ని ఆహార స్వయం సమృద్ధి దిశగా నడిపించారు. 1971లో భారత్‌పాక్ యుద్ధం సమయంలో రక్షణ మంత్రిగా ఉన్నారు. ఆ యుద్ధంలో భారత్ విజయం సాధించడంలోనూ, బంగ్లాదేశ్ ఆవిర్భావంలోనూ ఆయన వ్యూహాలు ఎంతో ముఖ్యమైనవి.

దళిత నేత: దేశవ్యాప్తంగా దళిత జాతులపై జరుగుతున్న దాడులను చూసి ఎంతో ఆవేదన చెందాడు. నిరంతరం దళిత జాతి చైతన్యం కోసమే ఆరాట పడేవాడు. అంటరానితనం నిర్మూలనకు, దళితులకు దక్కాల్సిన హక్కుల కోసం 1934లో 'ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్' స్థాపించారు. ఆయన కుమార్తె మీరా కుమార్ భారత తొలి మహిళా లోక్‌సభ స్పీకర్‌గా పనిచేశారు.

నిష్క్రమణం:

జగ్జీవన్ రామ్ జయంతిని (ఏప్రిల్ 5) భారతదేశంలో "సమతా దివస్" (సమానత్వ దినోత్సవం) గా జరుపుకుంటారు. అజాతశత్రువుగా భారత రాజకీయ సామాజిక రంగాల్లో వెలుగొందిన జగ్జీవన్ రామ్ తన 78వ ఏట 1986 జూలై 6న కన్నుమూశాడు. అందరం బాబూజీ అని గౌరవంగా పిలుచుకున్నా ఆయన చూపిన సంస్కరణ గుర్తు చేసుకుంటూ ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది.

(నేడు జగ్జీవన్ రామ్ 119వ జయంతి)

(వ్యాసకర్త తెలుగు ఉపన్యాసకులు)

ప్రజల 'మమత' ఎవరిపైనో..ఎవరికో పట్టం?



అంబీర్ శ్రీకాంత్
8185968059

2011 నుంచి అప్రతిహతంగా పశ్చిమబెంగాల్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా మమతాబెనర్జీ సేవలందిస్తున్నారు. ఈ నెల 23, 29 తేదీల్లో ఈ స్టేట్‌కు ఎన్నికలు జరగనుండగా, ఫలితాలు వచ్చే నెల 4న రానున్నాయి. ఆ రోజున వెస్ట్ బెంగాల్ప్రజలు ఎవరిపైన తమ 'మమతా'నురాగాలు చూపించారనేది తేలనుంది. 294 అసెంబ్లీ స్థానాలున్న ఈ ఎలక్షన్స్‌ను అధికార పార్టీ లీడర్, ప్రస్తుత ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతాబెనర్జీ సహజంగానే అత్యంత సీరియస్‌గా తీసుకుంటున్నారు. సర్వశక్తులు ఒడ్డి మరోసారి అధికారం చేజిక్కించుకోవాలని చూస్తున్నారు. కాగా, మమతను ఎన్నికల రణక్షేత్రంలో ఢీకొనేలా సర్వబలంతో కేంద్రంలో పవర్‌లో ఉన్న బీజేపీ ప్రయత్నిస్తున్నది. సామదానభేద దండోపాయాలను అమలు చేస్తూ..ఇప్పటికే కమలనాథులను పెద్ద ఎత్తున పశ్చిమ బెంగాల్‌లో మోహరింపజేస్తున్నది. దీంతో ఎన్నికల వాతావరణం ఫుల్ హీటెక్కింది. మాటలు తూటాలు పేలుతున్నాయి. వ్యూహ, ప్రతివ్యూహాలు తారస్థాయికి చేరుతున్నాయి. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ సైతం రంగంలోకి దిగేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఢిల్లీ కాషాయదళం లీడర్లు ఇప్పటికే క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారు.

అన్నిస్థానాల్లో 'ఆమె' ఎలా పోటీ?

మాజీ టెన్నిస్ ప్లేయర్ లియాండర్ పేస్ తాజాగా బీజేపీలో చేరారు. ఇక ఇప్పటికే బీజేపీ తరఫున ఎన్నికల బరిలో నిలిచే ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితానూ విడుదల చేసింది. కమలం పార్టీ తరఫున స్టార్ క్యాంపెయినర్లు రంగంలోకి దిగి .. అభ్యర్థుల తరఫున ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఈ క్రమంలోనే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. మొత్తం 294 స్థానాల్లో తానే పోటీ చేస్తున్నట్లుగా పశ్చిమ బెంగాల్ ప్రజలు భావించాలని, తనను గెలిపించాలని మమత జనాన్ని అభ్యర్థించారు. ప్రజాస్వామ్యంలో ఒక అభ్యర్థి ఒకటి లేదా రెండు స్థానాల్లో పోటీ చేయొచ్చు. రెండు స్థానాల్లో గెలిస్తే ఏదో ఒక దానికి రాజీనామ చేయాల్సి ఉంటుంది. అలాంటిది అన్ని స్థానాల్లో తానే పోటీ చేస్తున్నట్లుగా మమత ఊహించుకోవాలని వ్యాఖ్యలు చేయడం అంటే భారత రాజకీయ వ్యవస్థలో వ్యక్తి ఆరాధన ఎంతలా వేళ్లూనుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. అంతేగాకుండా ప్రాంతీయ పార్టీ అధినేత్రిగా ఉన్న తాను పశ్చిమ బెంగాల్ వాయిస్‌ను వినిపించే నాయకురాలినని, గుజరాత్ ఆధిపత్యాన్ని ఎదుర్కొనే తెగువ ఉన్న మహిళను అనే సంకేతాన్ని ప్రజల్లోకి బలంగా



పంపించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రాంతీయ పార్టీ టీఎంసీ(తృణమూల్ కాంగ్రెస్) వర్సెస్ జాతీయ పార్టీ (బీజేపీ) అనే దృక్పథాన్ని ప్రజల్లోకి బలంగా పంపిస్తున్నది. అయితే, సింబాలిజంలో భాగంగా ఆర్జీకర్ మెడికల్ కాలేజీ బాధితురాలి కుటుంబం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలిపారు. 40 ఏళ్ల లోపున్న క్యాండిడేట్లు 36 మందికి అవకాశమిచ్చారు. సోషల్ ఇంజినీరింగ్‌లో భాగంగా సామాజిక, రాజకీయంగా ప్రభావం చూపునున్న అన్ని వర్గాల మద్దతును కూడగట్టుకునే దిశగా బీజేపీ పకడ్బందీ వ్యూహాలను అమలు చేస్తున్నది. ఈ సందర్భంలో పశ్చిమ బెంగాల్ ప్రజల మనసులో ఏమున్నది? ఇప్పటికే రెండు సార్లు అధికారంలో ఉన్న టీఎంసీకి వ్యతిరేకత ఏ మేరకు ఉన్నది? అది బీజేపీ వైపు ఓటు బ్యాంకుగా మారి ఎంత శాతం షిఫ్ట్ కానుంది? ప్రజల నిర్ణయం ఎటు వైపు ఉండనుందనేది తెలియాలంటే వచ్చే నెల 4 వరకు వేచి చూడాల్సిందే.

(వ్యాసకర్త, సీనియర్ జర్నలిస్టు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

రాజకీయం



అంబేద్కర్ వేషధారణలో చిన్నారి

- చిత్రపటాన్ని అందజేసిన స్కూల్ యజమాన్యం

ప్రతిపక్షం, మహేశ్వరం, ఏప్రిల్ 4: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామానికి చెందిన జర్నలిస్ట్ చిక్కిరి శ్రీకాంత్ చిన్న కుమారుడు గణతంత్ర దినోత్సవ వేడుకలలో.. అంబేద్కర్ వేషధారణలో ప్రతిభను చూపించడం జరిగింది.. శంషాబాద్ మండల కేంద్రంలోని పెద్ద గోల్కొండ లో శ్రీ జ్ఞాన సరస్వతి విద్యా మందిర్ హై స్కూల్ లో సృజన్ తేజ్ ఎల్ కే జీ చదువుతున్నాడు అదే క్రమంలో.. జనవరిలో గణతంత్ర దినోత్సవ వేడుకలలో.. అంబేద్కర్ వేషధారణలో పాల్గొని అందర్నీ ఆకర్షించినందుకు.. పెద్ద గోల్కొండ శ్రీ జ్ఞాన సరస్వతి విద్యా మందిర్ హై స్కూల్ యజమాన్యం.. చేతుల మీదుగా చిత్రపటాన్ని బహూకరించడం జరిగింది..



సుజాత ఇంటర్నేషనల్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

- ఫీజుల పెంపుతో పేద విద్యార్థుల నడ్డి విరుస్తున్నారు
- ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ డిమాండ్

ప్రతిపక్షం, మొయినాబాద్, ఏప్రిల్ 4 : మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని సుజాత ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని, అధిక ఫీజుల వసూళ్లతో పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల పై పెనుభారం మోపుతోందని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ విమర్శించారు. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాల ఫీజులను అమాంతం పెంచడాన్ని నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట చేపట్టిన ధర్నాకు ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. కార్పొరేట్ శైలిలో నడుస్తున్న సుజాత పాఠశాల ఏకంగా 33 శాతం మేర ఫీజులను పెంచడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ సాగిస్తున్న ఈ ఫీజుల దందాను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఎంఈఓ వెంటనే స్పందించి పాఠశాలలో ఫీజుల పెంపుపై సమగ్ర విచారణ జరిపి, యాజమాన్యానికి నోటీసులు జారీ చేయాలని కోరారు. లేనట్లయితే జిల్లా కలెక్టర్, డీఈఓలకు ఫిర్యాదు చేయడంతో పాటు, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాల ముందు నిరవధిక ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- ఎమ్మెల్యే కాలే యాదయ్య

ప్రతిపక్షం, మొయినాబాద్, ఏప్రిల్ 4 : అజీజ్ నగర్ కేఎల్ యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన 'ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్' కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాలే యాదయ్య జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. క్యాంపస్ సెలక్షన్లలోనే ఉద్యోగాలు సాధించడం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం యువత ఉపాధి కోసం అనేక శిక్షణ కార్యక్రమాలను అమలు చేస్తోందని వెల్లడించారు. కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు కార్పొరేట్ స్థాయిలో అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ప్రతినిధులు, స్థానిక నేతలు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

యేసు క్రీస్తు ప్రేమను సమాజానికి చాటి చెప్పేదే రన్ ఫర్ జీసస్

- టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 4 : యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణం లో నిర్వహించిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమం లో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి ఈస్టర్ సందర్భం గా సంగారెడ్డి పట్టణం లో యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంగారెడ్డి పట్టణం లోని ఓల్డ్ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం నుండి మొదలుకుని పోతీ రెడ్డి పల్లి చౌరస్తా వరకు అక్కడి నుండి సిఎస్ఐ చర్చ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కీర్తనలు పాడుతూ, నృత్యాలు చేస్తూ క్రీస్తు ను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ యేసు పునరుత్థానం ను స్మరించుకుంటు , యేసు ప్రేమను ఈ సమాజానికి తెలుపడానికి రన్ ఫర్ జీసస్ దోహదపడుతుంది అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో టీ పిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జార్జ్, నాయకులు కూన సంతోష్ లతో పాటు యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం. నాయకులు .. రూబీ న్ రెడ్డి, ప్రవీణ్, సునీల్ నిర్మల్ కుమార్, మధు మోహన్, సునీల్ జై కుమార్,.పాస్టర్ లు రెవరెండ్ జార్జ్ ఎబినైసర్, రెవరెండ్ మధు కుమార్, రెవరెండ్ జాన్ పీటర్, సత్యానంద్, సత్య పాల్ పాల్గొన్నారు.



ఎన్కేపల్లి చౌరస్తాలో చలివేంద్రం ప్రారంభం

ప్రతిపక్షం, మొయినాబాద్, ఏప్రిల్ 04 : వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్కేపల్లి చౌరస్తాలో శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 11వ వార్డు కౌన్సిలర్ మహేష్ మరియు షాబాద్ దర్శన్ చైర్మన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.ఎండలు మండుతున్న వేళ బాటసారులకు, వాహనదారులకు చల్లని నీరు అందించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రద్దీగా ఉండే చౌరస్తాలో చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు, ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



హత్య చేసి పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్

- రిమాండ్ కు తరలింపు

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, ఏప్రిల్ 4: కామారెడ్డి పట్టణంలోని న్యూ బస్ స్టాండ్‌లో గత ఫిబ్రవరిలో సంచలనం సృష్టించిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. కేవలం మొబైల్ ఫోన్, నగదు కోసం తోటి కూలీని అత్యంత కిరాతకంగా హతమార్చిన నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు కామారెడ్డి ఏఎస్పి బి. చైతన్య రెడ్డి వివరాలను వెల్లడించారు. గత ఫిబ్రవరి 12వ తేదీ రాత్రి సుమారు 8:55 గంటల సమయంలో, కామారెడ్డి బస్ స్టాండ్ ఎంక్వయిరీ కౌంటర్ వద్ద ఇద్దరు వ్యక్తుల మధ్య మొబైల్ ఫోన్ విషయమై ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో నిందితుడు బాధితుడైన శ్రీనివాస్ (కూలీ) పై ముఖం, ఛాతిపై విచక్షణారహితంగా దాడి చేసి, కిందపడేసి చంపాడు. అనంతరం బాధితుడి వద్ద ఉన్న మొబైల్ ఫోన్ మరియు రూ. 300 నగదును దోచుకుని అక్కడి నుండి పరారయ్యాడు. ఈ విషయం పై బస్ స్టాండ్ కంట్రోలర్ షెర్ల సత్య గౌడ్ ఫిర్యాదు మేరకు కామారెడ్డి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంబించడం జరిగినది. ఘటన వివరాల్లోకి వెళ్తే గత ఫిబ్రవరి 12వ తేదీ రాత్రి సుమారు 8:55 గంటల సమయంలో, బస్టాండ్ ఎంక్వయిరీ కౌంటర్ వద్ద నిందితుడు ఆకాష్ నాగురావ్ కోవె, మరో కూలీ అయిన శ్రీనివాస్‌తో మొబైల్ ఫోన్ విషయమై గొడవకు దిగాడు. ఈ క్రమంలో నిందితుడు శ్రీనివాస్‌పై ముఖం మరియు ఛాతిపై తీవ్రంగా దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం బాధితుడి వద్ద ఉన్న ఒప్పో (Oppo) మొబైల్ ఫోన్ రూ. 300 నగదును దోచుకుని నిందితుడు పరారయ్యాడు. బస్టాండ్ కంట్రోలర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తులో భాగంగా నిందితుడు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో తలదాచుకున్నట్లు గుర్తించారు. ఈరోజు కామారెడ్డి రైల్వే స్టేషన్ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు నిందితుడిని పట్టుకుని విచారించగా, అతను తన నేరాన్ని అంగీకరించాడు. నిందితుడి వద్ద నుండి చోరీకి గురైన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, అతడిని రిమాండ్‌కు తరలించారు. నిందితుడి వద్ద నుండి మరణించిన వ్యక్తికి సంబదించిన ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొన్నారు. ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించిన కామారెడ్డి పట్టణ ఇన్స్పెక్టర్ బి. నరహరి, ఏఎస్ఐ రంగా రావు, కానిస్టేబుళ్లు కమలాకర్, రాజు, సంపత్ లను జిల్లా ఎస్పీ, ఏఎస్పి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే, నిందితుడి ఆచూకీకి సంబంధించిన సమాచారం అందించిన షేక్ సద్దాంను ఎస్పీ అభినందించి ప్రశంసించారు.



జహీరాబాద్ లో రన్ ఫర్ జీసస్ భారీ ర్యాలీ

- పాల్గొన్న మాజీ మంత్రి చంద్రశేఖర్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 4 : జహీరాబాద్ పట్టణంలోని క్రిస్టయిన్ యూత్ అసోసియేషన్ జహీరాబాద్ వారు నిర్వహించిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొని ముందుగా జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలందరికీ ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మెథడిస్ట్ సెంట్రల్ చర్చ్ లో ఏర్పాటు చేసినా సభా సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నియోజకవర్గంలోని క్రైస్తవులు జరుపుకొనే ఈ రన్ ఫర్ జీసస్ కార్యక్రమం క్రైస్తవ సంఘాల ఐక్యతకు నిదర్శనం,ఇదే స్ఫూర్తితో అన్ని గ్రామాల నుండి తరలి వచ్చిన ప్రజలందరూ శాంతియుతంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మునిసిపల్ ఛైర్మెన్ యూనుస్ , పట్టణ అద్యక్షులు కండేం.నర్సింలు , మొగుడంపల్లి మండల అద్యక్షులు మాక్సూద్ అహ్మద్ ,కౌన్సిలర్స్ మహేష్ , చౌహన్ వాకీల్ , కాంగ్రెస్ నాయకులు హుగ్గేల్లి.రాములు , మరియు సీవైఏజెడ్ సభ్యులు పాల్గొన్నారు.



పార్టీ కొరకు కష్టపడుతున్న సంజయ్ కు పదవి ఇవ్వాలి

- సంజయ్ అనుచరులు అభిమానుల నిరాహార దీక్ష

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఏప్రిల్ 4 : నగర కాంగ్రెస్ పార్టీ కొరకు ఎంతో కాలంగా కష్టపడుతున్న మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ కు ప్రభుత్వం లో తగిన పదవీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆయన అనుచరులు, అభిమానులు నిరాహార దీక్ష చేపట్టారు. శనివారం జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ లో సంజయ్ కు సముచిత స్థానం కల్పించాలని కోరుతూ ఆయన అభిమానులు భారీ నిరసనకు దిగారు. ఈ సందర్భంగా నగరంలో పలుచోట్ల సంజయ్ కి ప్రభుత్వంలో పదవి కల్పించాలని కోరుతూ ఫ్లెక్సీలు ఏర్పాట్లు చేశారు. నగర కాంగ్రెస్ పార్టీ కోసం ఎంతో కాలంగా కష్టపడుతున్న, ప్రభుత్వం వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తి అవుతున్న, ఇటీవల జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలో పార్టీ విజయం సాధించిన వెనుక సంజయ్ కృషి ఎంతో ఉందని అన్నారు. అయినప్పటికీ సంజయ్ ను ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నగర కాంగ్రెస్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన సంజయ్ కు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ ఎలాంటి పదవి దక్కకపోవడంపై అభిమానులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నగర మేయర్ గా పని చేసిన కాలంలో ఆయన చేసిన అభివృద్ధి ముద్ర స్పష్టంగా కనబడుతుందన్నారు. అలాంటి నాయకుడికి ఇప్పుడు పార్టీలో గుర్తింపు లేకపోవడం బాధాకరమని తెలిపారు. మరోవైపు, గత కొంతకాలంగా పార్టీలో తనకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదని సంజయ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇదే ధోరణి కొనసాగితే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసే ఆలోచనలో ఆయన ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఆయన మద్దతుదారులు రోడ్డెక్కడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. గాంధీ చౌక్ వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం అభిమానులు మాట్లాడుతూ సంజయ్ సేవలను గుర్తించి ప్రభుత్వం తక్షణమే ఆయనకు తగిన పదవీ ఇవ్వాలని, లేనిపక్షంలో నగరంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నా రు. అధిష్టానం స్పందించకుంటే భవిష్యత్ కార్యాచరణను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంజయ్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిజామాబాద్ నగర కార్పొరేషన్ డిసిసి అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ దీక్ష శిబిరాన్ని సందర్శించి దీక్ష లో ఉన్నవారికి నిమ్మ రసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు.

రేవంత్ రెడ్డి చెబుతున్నవన్నీ..అబద్ధాలే

- కేరళలో మళ్లీ కాంగ్రెస్ ను ఓటమి తథ్యం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సవాల్



ప్రతిపక్షం బ్యూరో, ఉమ్మడి కరీంనగర్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు తెలంగాణలో అమలవుతున్నాయని చెప్పడం పచ్చి అబద్ధమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. అబద్ధాలాడటంలో రేవంత్ రెడ్డికి ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా సీఎంకు సవాల్ విసిరారు. "సీఎంగారు... కేరళ మీడియాను వెంట బెట్టుకుని తెలంగాణలో ఏ గ్రామానికైనా వెళదాం. మహిళలకు నెలనెలా రూ.2500లు, తులం బంగారం, స్కూటీ, వృద్దులకు రూ.4 వేల ఆసరా పెన్షన్లు, నిరుద్యోగులకు రూ.4 వేల భ్రుతి, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు, కౌలు రైతులు, రైతు కూలీలకు రైతు భరోసా పైసలు ఇస్తున్నట్లు మీరు నిరూపిస్తే నేను వెంటనే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేస్తా. పైవాటిలో ఏ ఒక్క హామీ కూడా అమలు చేయడం లేదని నేను నిరూపిస్తా. మీరు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెబుతారా?''అంటూ సవాల్ విసిరారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ లో డంపింగ్ యార్డు స్థల పరిశీలనకు వచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కేరళ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి తీరుపై మండిపడ్డారు.అబద్ధాలాడటంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చు. గతంలో బీహార్, ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడానికి ప్రధాన కారణం రేవంత్ రెడ్డే. స్టార్ క్యాంపెయినర్ గా ఆయా రాష్ట్రాలకు వెళ్లిన రేవంత్ రెడ్డి తెలంగాణలో 6 గ్యారంటీలను అమలు చేస్తున్నామని, వచ్చి పరిశీలించాలని చెప్పారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకుని కాంగ్రెస్ కు కర్రుకాల్చి వాతపెట్టారన్నారు. మళ్ళీ ఇప్పుడు కేరళలో కూడా మళ్లీ 6 గ్యారంటీలను తెలంగాణలో అమలు చేస్తున్నామని రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలాడుతున్నారని పేర్కొన్నారు. నిజానికి సీఎం రేవంత్ రెడ్డి కేరళకు వెళ్లింది మూటలు అప్పగించడానికే తప్ప చేసిందేమీ లేదన్నారు. రేవంత్ రెడ్డి గుండెపై చేయివేసుకుని చెప్పాలి. మహిళలకు రూ.2500లు, తులం బంగారం, స్కూటీ, రూ.4 వేల ఆసరా పెన్షన్లు, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు, నిరుద్యోగులకు రూ.4 వేల భ్రుతి, కౌలు రైతులు, రైతు కూలీలకు రైతు భరోసా పైసలు ఇచ్చావా? స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.. రైతులకు రైతు భరోసా పైసలు కూడా ఎకరానికే పరిమితం చేసి ఊరించి ఊరించి సంపుతున్నారు. అంతెందుకు ఉద్యోగ విరమణ చేసిన వాళ్లకు పెన్షన్ బెన్ ఫిట్స్ ఇవ్వడం లేదు. ఉద్యోగులకు డీఏలు ఇవ్వడం లేదని అన్నారు.



బీఆర్ఎస్ ను వీడిన బోటిమీదిపల్లె సర్పంచ్

- కాంగ్రెస్ లో చేరిక.. కండువా కప్పిన కవ్వంపల్లి

ప్రతిపక్షం బ్యూరో, ఉమ్మడి కరీంనగర్ : మానకొండూర్ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ లో చేరికల పర్వం కొనసాగుతున్నది. ఇప్పటికే పలు మండలాల్లో బీఆర్ఎస్ కు చెందిన సర్పంచులు ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారు. తాజాగా శనివారం ఇల్లంతకుంట మండలం బోటిమీదిపల్లి గ్రామ సర్పంచ్ గౌరవేణి శివాని తన భర్త సుమన్ తో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కాంగ్రెస్ కండువాలు కప్పారు. వారితోపాటు ఉప సర్పంచ్ అత పృ కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలకు మరియు సిద్ధాంతాలకు ఆకర్షితులై గౌరవ మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు & టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా.కవ్వంపల్లి సత్యనారాయణ గారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ లో చేరిన బోటిమీదిపల్లి గ్రామ సర్పంచ్ శ్రీమతి శివాని,ఆమె భర్త సుమన్, ఉప సర్పంచ్ దంపతులు లతిక నరేష్, వార్డు సభ్యులు గౌరవేని పర్శరాములు, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు దురుమట్ల రాములు, సభ్యులు గొడుగు నర్సింగం, దుర్గయ్య, రాజయ్య, దేవయ్య, లచ్చయ్య, లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.



జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ సీట్లు కోల్పోతాయని విపక్షాలు చేస్తున్న వాదలు సరికాదు. అదంతా తప్పుడు ప్రచారం. ఎల్డీఎఫ్, యూడీఎఫ్ లు శబరిమల ఆలయ ఖ్యాతిని తగ్గించేందుకు ప్రయత్నించాయి. ఎన్డీఏ అధికారంలోకి రాగానే నిందితులను శిక్షిస్తాం.
- ప్రధాని నరేంద్ర మోడీ

ప్రాంతీయం



వైద్యసేవల్లో నిర్లక్ష్యం తగదు

- తన్నీరు హరీశ్ రావు, మాజీ మంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే

ప్రతిపక్షం, నంగునూరు, ఏప్రిల్ 4: ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించ వద్దని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు వైద్యులకు సూచించారు. శనివారం నంగునూరు మండలం గట్లమల్యాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రిజిస్టర్లను పరిశీలించారు. మందుల నిల్వ రిజిస్టర్ ను తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నిర్వహణ పట్ల అసహనం వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనలో జాప్యం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. రోగులకు ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. రోగుల నుంచి సేకరించిన రక్త నమూనాలను ఎప్పటికప్పుడు 'టీడయాగ్నోస్టిక్స్'కు పంపాలని సూచించారు. 24 గంటలలోపే రిపోర్టులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. వాగు అవతలి గ్రామాల ప్రజలు వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే గట్లమల్యాలలో ఈ ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో సేవలు కుంటుపడితే సహించేది లేదన్నారు. వైద్యులు సకాలంలో అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలను అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఎమ్మెల్యే బీపీని చెక్ చేయించుకున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్



ప్రతిపక్షం, నంగునూరు, ఏప్రిల్ 4: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతును రాజుగా నిలబెట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని నంగునూరు మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం మీడియా సమావేశంలో సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొన్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని, అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులకు సరైన ధరలు, సకాలంలో కొనుగోలు, మార్కెట్ సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతు బతుకుదెరువు మాత్రమే కాదు, అతని ఆర్థిక స్థితి మెరుగుపడేలా ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. పంటల కొనుగోలు సమయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా మార్కెట్ కమిటీలు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు గోదాములు, తూకం యంత్రాలు, రవాణా సౌకర్యాలు అన్నీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రాబోయే సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, కొనుగోలు కేంద్రాలను ముందుగానే సిద్ధం చేయడం, మద్దతు ధరలు రైతులకు లాభదాయకంగా ఉండేలా చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. రైతు ఉత్పత్తికి సరైన విలువ దక్కేలా ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని అన్నారు. రైతు సమస్యలు తెలిసిన వాడు.. రైతు కష్టాలను దగ్గర నుండి చూసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణ మాఫీ చేసి రైతు బాంధవుడిగా మారిన నాయకుడు రేవంత్‌రెడ్డి ఒక్కరేనన్నారు. ప్రతి రైతు కళ్లల్లో ఆనందం చూడాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు.



క్యాంప్ కార్యాలయం ముట్టడి, ధ్వంసం పై ఫిర్యాదు

ప్రతిపక్షం, గజ్వేల్, ఏప్రిల్ 4: గజ్వేల్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై దాడి, ఫర్నిచర్ ధ్వంసం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకుల వైఖరి నిరసిస్తూ శనివారం నాడు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీఇన్చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి స్థానిక పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రవికుమార్ కు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ కాంగ్రెస్ నాయకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని చట్టాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దేవిరవీందర్, మాదాసు శ్రీనివాస్, బయ్యారం శ్రీనివాస్ రెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు బెండ మధు, జుబేర్ పాషా, జకీయోద్దీన్, నవాజ్ మీరా, హైమద్, గంశెట్టి రవి వివిధ మండలాల బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



రి ప్రదర్శనలో పాల్గొన్న అశేష భక్త జనావళి

ప్రతిపక్షం, గజ్వేల్ (వర్గల్), ఏప్రిల్ 4: లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రం (స్వాతి) పురస్కరించుకొని శనివారం నాడు వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో సరస్వతి పీఠాధిపతులు మాధవానంద సరస్వతి స్వీయ పర్యవేక్షణలో అశేష భక్త జనవాహిని పాల్గొనగా, నారసింహ నామస్మరణలతో క్షేత్రం మారు మ్రోగుతూ గిరి ప్రదక్షణ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్తల చైర్మన్ రవీందర్ గుప్తా, కార్యనిర్వాణాధికారి రంగాచారి ఆధ్వర్యంలో ధర్మకర్తలు చందా నాగరాజు, గాలి కిష్టయ్య, కొత్తపల్లి శ్రీనివాస్, ఉషశ్రీ రాజశేఖర్ శర్మ, కర్రె పద్మా వెంకటేష్, జక్కన్న గారి సురేందర్ రెడ్డి, కూచవరం సంతోష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ ల తోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చేందుకే ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



ప్రతిపక్షం,మెదక్ టౌన్,ఏప్రిల్ 4: ఇల్లు లేని నిరుపేదలకు సొంత ఇల్లు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. శనివారం చిన్న శంకరంపేట రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో 88 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు.అలాగే నార్సింగ్ మండలానికి చెందిన 20 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులు, చిన్న శంకరంపేట మండలానికి చెందిన 50 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు,నార్సింగి మండలానికి చెందిన మరో 20 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేదవాడికి సొంత ఇల్లు నిర్మించుకునేలా కృషి చేస్తోందన్నారు.అర్హులైన వారికి దశలవారీగా ఇళ్ల మంజూరు జరుగుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు,మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దాడి అవాస్తవం సీఎం చిత్ర పటమే ధ్యేయం

- రాజకీయ ఉనికి కోసమే వారి ఆరాటం
- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

ప్రతిపక్షం, గజ్వేల్, ఏప్రిల్ 04: ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఘటనపై తప్పుడు ప్రచారం జరుగుతోందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆస్తిగా ఉన్న క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటం లేకపోవడం గమనించి తమ పార్టీ కార్యకర్తలు అక్కడికి వెళ్లి చిత్రపటాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శనివారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ, క్యాంప్ కార్యాలయం ప్రభుత్వానికి చెందినదని అక్కడ ముఖ్యమంత్రి చిత్రపటం ఉండటం సహజం. అది లేకపోవడంతో తమ కార్యకర్తలు వెళ్లి గౌరవంగా సీఎం చిత్రపటాన్ని పెట్టి వచ్చారు. తప్ప అక్కడ ఎలాంటి దాడులు, విధ్వంసం జరగలేదని స్పష్టం చేశారు. కావాలనే కొందరు ఈ సంఘటనను వక్రీకరించి దాడిగా ప్రచారం పూర్తిగా అసత్యం అన్నారు. ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకుని తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ఆయన కోరారు.



సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలి

- సిద్ధిపేట నియోజకవర్గం ఇన్చార్జ్ పూజల హరికృష్ణ,పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్
- కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు నాయకులు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఏప్రిల్ 4: మరో 10 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం లో ఉంటుంది అని అన్ని వర్గాలను అభివృద్ధి చేసుకుందాం అని సిద్ధిపేట నియోజకవర్గం ఇన్చార్జ్ పూజల హరికృష్ణ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేటలో కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయం లో 11 వార్డుకు చెందిన బీఆర్ ఎస్ పార్టీ చెందిన నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ లో చేరిన వారికి సిద్ధిపేట నియోజకవర్గం ఇన్చార్జ్ పూజల హరికృష్ణ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ కండువాలు కప్పిపార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సిద్ధిపేట నియోజకవర్గం ఇన్చార్జ్ పూజల హరికృష్ణ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ 10 సంవత్సరాలు ప్రజలు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని కెసిఆర్ నాశనం చేశారు అని అన్నారు. ధనిక రాష్ట్రం గా ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేశారని లక్షల కోట్లు రూపాయలు కెసిఆర్ కుటుంబం దోచుకున్నారు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినక కెసిఆర్ కుటుంబం చేసిన అప్పులకు వడ్డీ చెల్లిస్తూ రాష్ట్రం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారు అని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను కెసిఆర్ మోసం చేశారు అని అందుకే ఫామ్ హౌజ్ కే కెసిఆర్ ను ప్రజలు పరిమితం చేశారు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూసేసిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తల మీద ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మల యాదగిరి ముద్దమ లక్ష్మీ రషద్ వహాబ్ గయాస్ హర్ష 3విజయ్ డానియల్ తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



ఘనంగా 'రన్ ఫర్ జీసస్ 2026' ర్యాలీ

ప్రతిపక్షం,మెదక్ టౌన్,ఏప్రిల్ 4: లోక రక్షకుడు యేసుక్రీస్తు పునరుత్థాన సందేశాన్ని చాటి చెబుతూ 'రన్ ఫర్ జీసస్ 2026' ర్యాలీని సిఎస్ఐ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.ప్రెస్ బీటర్ ఇంచార్జీ శాంతయ్య ప్రార్థనతో ర్యాలీ ప్రారంభమైంది. చర్చ్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల గుండా సాగింది.ర్యాలీలో యువతీ యువకులు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొని యేసు క్రీస్తు పునరుత్థానాన్ని కీర్తిస్తూ నినాదాలు చేశారు. భక్తి గీతాలకు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా శాంతయ్య మాట్లాడుతూ.. ఈస్టర్ పండుగకు ముందు వచ్చే మహా శనివారం సందర్భంగా ఈ ర్యాలీ నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. ప్రతి సంవత్సరం సిఎస్ఐ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గంట సంపత్, చర్చ్ కమిటీ సభ్యులు, గురువులు, భక్తులు పాల్గొన్నారు.



అవని దిన పత్రిక సంపాదకుడు కూతురు రాజిరెడ్డికి మాతృ వియోగం

ప్రతిపక్షం, నంగునూరు, ఏప్రిల్ 4: అవని దిన పత్రిక సంపాదకుడు, సీనియర్ జర్నలిస్టు కూతురు రాజిరెడ్డి , బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు సుశీలా రెడ్డి తల్లి కూతురు మల్లవ్వ(85) శుక్రవారం రాత్రి మరణించారు. అశ్రు నయనాల మధ్య ఆమె అంత్యక్రియలు సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట గ్రామంలో శనివారం మధ్యాహ్నం జరిగాయి. శనివారం ఉదయం మాజీ మంత్రి హరీష్ రావు నర్మెటలో వారి కుటుంబాన్ని పరామర్శించారు. మల్లవ్వ భౌతికకాయం వద్ద నివాళులు అర్పించారు. బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు తుల ఉమ, రాష్ట్ర మహిళ నాయకులు, మాజీ కార్పొరేషన్ చైర్ పర్సన్లు మంత్రి శ్రీదేవి, టీఎస్పీఎస్సీ మాజీ సభ్యులు సుమిత్రానంద్ తనోబా, బీఆర్ఎస్ మహిళా నాయకులు రుద్రారాధ, పద్మ, నిర్మల, మంతూరు పద్మ, బీఆర్ఎస్ సోషల్ మీడియా రాష్ట్ర నాయకులు రామ్మూర్తి, శ్రీనివాస్ రెడ్డి, నరేష్ గౌడ్, ఆకుబత్తిని రాము, టీయూడబ్ల్యూజే సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు కలకుంట్ల రంగాచారి, జర్నలిస్టులు రమణారావు, సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మాజీ జడ్పీటీసీలు తడిసిన ఉమాదేవి, మల్లయ్య, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షులు లింగం గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కోల రమేశ్ గౌడ్, నాయకులు కిష్టారెడ్డి, ఎడ్ల అరవింద్ రెడ్డి, నాయిని వెంకట రెడ్డి, నాయిని రవీందర్ రెడ్డి, శనివారం బాబు, అజీజ్, నార్లపురం శ్రీనివాస్, నారాయణ, రాళ్ళబండి రమణాచారి రాజిరెడ్డిని పరామర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో కుంటుపడిన అభివృద్ధి

- తన్నీరు హరీశ్ రావు, మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే



ప్రతిపక్షం,నంగునూరు, ఏప్రిల్ 4 : రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని మాజీ మంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు ఆరోపించారు. నంగునూరు మండలం రాంపూర్ లోని శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవాలయ ఉత్సవాల్లో మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు శనివారం పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం గట్లమల్యాలలో పెద్దమ్మ తల్లి వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గట్లమల్యాలలో మాట్లాడుతూ సిద్ధిపేట నియోజకవర్గం అభివృద్ధికి తన వంతు కృషి చేశానని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధికి చీకటి రోజులు వచ్చాయని తెలిపారు. పెద్దమ్మ తల్లి దయతో మళ్లీ మంచి రోజులు వస్తాయని చెప్పారు. బీ ఆర్ ఎస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలోని గ్రామాలకు విద్య, వైద్యం, సాగునీరు అందించామని చెప్పారు. కరోనా కష్ట కాలంలోనూ కేసీఆర్ రైతుబంధు ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నేడు మూడు సీజన్లలో రైతుబంధు రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా కావడం లేదని అన్నారు. సాయంత్రం పోతే మళ్లీ ఉదయం 4 గంటలకు వస్తున్న గడ్డి పరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గట్ల మల్యాల అభివృద్ధికి ఎప్పటికీ తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. గట్లమల్యాలలో గ్రామస్తులు అందరితో కలిసి పెద్దమ్మ తల్లి వార్షికోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వాగు అవతల ఉన్న గ్రామాలు అభివృద్ధిలో వెనుక బడ్డాయని చెప్పారు. ఈ గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలను అందించాలని ఎవరూ అడగక ముందే ఇక్కడ రూ.1.6కోట్లతో పీహెచ్‌సీ భవనాన్ని మంజూరు చేయించానన్నారు. ముగ్గురు డాక్టర్లు, స్టాఫ్ నర్సులను నియమించి రాత్రింబవళ్లు గట్లమల్యాల ప్రజలకు వైద్యం అందేలా చేశామని చెప్పారు. తాను మార్కెటింగ్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాంత రైతుల కోసం ప్రత్యేకంగా వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడే షెడ్లు నిర్మించి, వడ్లు, మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచామని చెప్పారు. వాగు అవతల గ్రామాలకు సాగునీటి కోసం లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని కూడా మంజూరు చేశామన్నారు. పనులు పూర్తయి ట్రయల్ రన్ విజయవంతం అయిందన్నారు.



అమరావతిలో కృష్ణా కరకట్టపై వెళ్తుంటే శ్మశానమే కనిపిస్తోంది. అమరావతిపై ప్రభుత్వానిది ప్రచారార్భాటమే. అక్కడి అవినీతికి తప్ప వైసీపీ దానికి వ్యతిరేకం కాదు. తీర్మానాలతో అమరావతి పర్మినెంట్ అయిపోయిందనుకుంటే పొరపాటే. దాన్ని శాసన రాజధానిగానే చూస్తాం. రెండేళ్లైనా నిర్మాణాలు పూర్తిచేయలేదు.

- వైసీపీ నేత బొత్స సత్యనారాయణ.



నేను గాయపడ్డాను.. అందుకే ప్రమాదకరంగా మారాను

- ఆప్ చేస్తున్న విమర్శలకు రాఘవ్ చద్దా స్ట్రాంగ్ కౌంటర్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: తనపై తీవ్ర ఆరోపణలు చేసిన ఆప్ పార్టీ నేతలకు, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌కు, ఎంపీ రాఘవ్ చద్దా తనదైన రీతిలో కౌంటర్ ఇచ్చారు. తాజాగా ఓ వీడియో విడుదల చేసిన ఆయన 'దురంధర్' చిత్రంలోని "నేను గాయపడ్డాను. అందుకే మరింత ప్రమాదకరంగా మారాను" అనే డైలాగ్‌తో సమాధానం ఇచ్చారు. ఇటీవల రాజ్యసభలో పార్టీ డిప్యూటీ లీడర్ పదవి నుంచి రాఘవ్ చద్దాను ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తొలగించింది. అంతేకాదు రాఘవ్ చద్దాను లక్ష్యంగా చేసుకుని అనేక మంది ఆప్ నేతలు విమర్శలు గుప్పించారు. అందులో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే రాఘవ్ చద్దా ఎక్స్ వేదికగా ఓ వీడియోను షేర్ చేశారు. అందులో తనపై చేస్తున్న ఆరోపణలు అన్నీ అవాస్తవం అని ఆయన పేర్కొన్నారు. తనపై కుట్ర జరుగుతోందని అన్నారు. "మొదట నేను ఎవరికీ సమాధానం చెప్పకూడదని అనుకున్నాను. కానీ ఒక అబద్ధాన్ని వంద సార్లు చెబితే, ప్రజల్లో కొందరైనా దానిని నిజమని నమ్మే ప్రమాదం ఉందని గ్రహించాను. అందుకే సమాధానం చెప్పాలని నిర్ణయించుకున్నాను. ఆమ్ ఆద్మీ పార్టీ నాపై 3 ఆరోపణలు చేసింది. ఆ మూడు తప్పులు చేసినందుకు నన్ను పార్లమెంట్‌లో మాట్లాడకుండా నిషేధించాలని పేర్కొన్నారు.

విశ్వ వీక్షణం



మైనారిటీలపై దాడులు చేసే వారితో సీఎం విజయన్‌కు సంబంధాలు

- తీవ్ర ఆరోపణలు చేసిన రాహుల్ గాంధీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, కొచ్చి, ఏప్రిల్ 4: దేశంలోని ఇతర ప్రాంతాలలో మైనారిటీలపై దాడి చేసే వ్యక్తులతో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు సంబంధాలున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. తన ఎన్నికల ప్రచారంలో శబరిమల అంశం గురించి ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడలేదని విమర్శించారు. బీజేపీఎల్‌డీఎఫ్ మధ్య పొత్తు ఉందని అన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఎల్‌డీఎఫ్‌లో ఎవరూ ఉండరని పేర్కొన్నారు. సీపీఎం పార్టీ తన ప్రధాన సిద్ధాంతంపై రాజీ పడుతోందని విమర్శించారు. కేరళలోని అలప్పుజలో జరిగిన బహిరంగ సభలో ఈ మేరకు ఎల్‌డీఎఫ్, బీజేపీపై రాహుల్ మండిపడ్డారు. అలాగే తనతో వేదిక పంచుకున్న మాజీ సీపీఎం నాయకుడు జి. సుధాకరన్ గురించి రాహుల్ గాంధీ ప్రస్తావించారు. "ఈ వేదికపై ఒక మాజీ సీనియర్ వామపక్ష నాయకుడు (సుధాకరన్‌ను ఉద్దేశించి) ఉన్నారు. ఆయన ఇక్కడ కూర్చోవడానికి ఒక కారణం ఉంది. ఆయన ఆలోచనలు అకస్మాత్తుగా మారిపోలేదు. ఒక రాజకీయ పార్టీలో చాలా ఏళ్లు పనిచేశారు. సుధాకరన్ అవకాశవాదంతో ఇక్కడికి కాలేదు. ఎల్‌డీఎఫ్‌లో ఏదో మార్పు జరగడం వల్లే ఇక్కడ ఉన్నారు. ఎల్‌డీఎఫ్ చాలా ఏళ్లుగా మాకు ప్రత్యర్థిగా ఉంది. మేము వారితో పోరాడాం. ఇకపైనా పోరాడుతూనే ఉంటాం. కానీ చాలా ఏళ్లుగా మేము విభేదించే కొన్ని భావజాలాలకు వారు అండగా నిలబడ్డారు." అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఎల్‌డీఎఫ్‌ను ఒక అదృశ్య హస్తం (బీజేపీ, మోదీని ఉద్దేశించి) నడిపిస్తోందని, అదే సీపీఎంలోని నాయకులను, కార్యకర్తలను కలవరపెడుతోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ అదృశ్య హస్తం మతతత్వమైనదని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని అంగీకరించదన్నారు. ప్రజలను విభజిస్తుందని, ద్వేషాన్ని వ్యాపింపజేస్తుందని తెలిపారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, సీపీఎంల మధ్య ఉన్న సంబంధం కేరళలోని ప్రతి ఒక్కరికి తెలుసని అన్నారు. "లెఫ్ట్ ఫ్రంట్‌లోని చాలా మంది నాయకులు అవకాశవాదులు. కొంతమంది అవకాశవాద నాయకులు అధికారంలోకి రావడానికి ఏదైనా చేస్తారు. వారికి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల నుంచి సహాయం అందినా పట్టించుకోరు. మరోవైపు, కొంతమంది ఎల్‌డీఎఫ్ కార్యకర్తలు సిద్ధాంతం కోసం ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నారు. వారు ద్రోహానికి, నిరాశకు, బాధకు గురయ్యారు. తమ పార్టీలో జరుగుతున్న పరిణామాల పట్ల చాలా కలత చెందుతున్నారు." అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

కూల్.. కూల్.. స్క్వాష్

ఎండలు ముదురుతున్నాయి. వాతావరణ మార్పులతో పిల్లల ఒంట్లో వేడి పెరుగుతుంది. ఆరోగ్యపరమైన తేడాలు మొదలవుతాయి. అందుకే ఈ కాలంలో పిల్లలకు మామూలు డైట్‌తో పాటు ఒంట్లో వేడిని తగ్గించే పానీయాలు అందించాలి. కానీ ఇలాంటి పానీయాలను చూస్తే పిల్లలు ముఖం తిప్పేసుకుంటారు. అందుకే వారికి కొంచెం కొత్తగా తాజా పండ్లతో 'స్క్వాష్' వంటి పానీయాలను చేసి ఇస్తే.. ఎగిరి గంతేసి తాగేస్తారు. మరి అలాంటి పానీయాలేంటో ఒకసారి చూద్దాం..



కమలాలతో..

కావలసిన పదార్థాలు

కమలాపండ్లు	ఆరు
పంచదార	అరకిలో
నిమ్మ ఉప్పు	ఒకటిన్నర చెంచా
ఆరెంజ్ కలర్	చిటికెడు
ఆరెంజ్ ఎమల్షన్	చెంచా
పొటాషియం మెటాబైసల్ఫేట్	పావు చెంచా

తయారుచేసే విధానం

పొటాషియం మెటాబైసల్ఫేట్ సూపర్ మార్కెట్లో దొరుకుతుంది. కమలాఫలాలను వలుచుకుని, మిక్సీలో వేసి జూస్‌లా చేసుకుని పక్కన పెట్టుకోవాలి. పంచదారలో అరగ్లాసు నీళ్లు పోసి స్టవ్‌పై ఉంచాలి. మంట తగ్గించి మధ్యమధ్యలో కలుపుతూ ఉండాలి. ఇది తీగపాకం వచ్చాక స్టవ్‌పై నుంచి దించేయాలి. చల్లారిన తరువాత కమలాఫలాల జూస్, నిమ్మ ఉప్పు, ఆరెంజ్ రంగు, ఆరెంజ్ ఎమల్షన్ వేసి బాగా కలపాలి. వీటిని బాగా కలిపిన తరువాత పొటాషియం మెటాబైసల్ఫేట్ వేసి మళ్లీ కలిపి ఫ్రిజ్‌లో ఉంచేయాలి. ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు చల్లచల్లగా సర్వ్ చేసుకోవచ్చు.

జింజర్ లైమ్‌తో..

కావలసిన పదార్థాలు

పంచదార	రెండు కప్పులు
నీళ్లు	కప్పు
అల్లం	చిన్నముక్క
నిమ్మకాయలు	నాలుగు పెద్దవి
ఎల్లో ఫుడ్‌కలర్	చిటికెడు
పొటాషియం మెటాబైసల్ఫేట్	చిటికెడు

తయారుచేసే విధానం

అల్లాన్ని చెక్కు తీసి మిక్సీలో వేసి నీళ్లు చల్లుకుంటూ మెత్తని గుజ్జులా, కాస్త పలుచగా చేసుకోవాలి. తరువాత నిమ్మరసాన్ని తీసుకుని పెట్టుకోవాలి. అడుగు మందంగా ఉన్న గిన్నేలో పంచదార, నీళ్లు, అల్లం గుజ్జు కలిపి స్టవ్‌పై ఉంచాలి. ఈ మిశ్రమాన్ని మధ్యమధ్యలో కలుపుతూ ఉంటే.. కాసేపటికి పాకం వస్తుంది. తీగ పాకం వచ్చాక దింపేయాలి. ఇది చల్లారిన తరువాత ఫుడ్ కలర్, నిమ్మరసం, పొటాషియం మెటాబైసల్ఫేట్ వేసి కలిపితే సరిపోతుంది. దీన్ని ఫ్రిజ్‌లో ఉంచుకోవాలి. దీనిని గ్లాసులో పావు వంతు తీసుకుని, ఇందులో ముప్పావు వంతు చల్లని నీళ్లు కలుపుకుని పిల్లలకు అందిస్తే వేసవిలో డీహైడ్రేషన్ అనేదే దరిచేరదు.





మామిడిపండుతో..

కావలసిన పదార్థాలు

మామిడిపండు గుజ్జు	అరలీటరు
పంచదార	కిలో
మ్యాంగో ఎమల్షన్	చెంచా
నిమ్మ ఉప్పు	పది గ్రాములు
సోడియం బెంజోయేట్	అర చెంచా

తయారుచేసే విధానం

మామిడి పండు గుజ్జును స్టవ్‌పై ఉంచి కాసేపు ఉడకనిచ్చి దింపేయాలి. పంచదారలో గ్లాసు నీళ్లుపోసి స్టవ్‌పై ఉంచాలి. పంచదార బాగా కరిగి తీగపాకం వచ్చాక దింపేయాలి. మామిడి గుజ్జు, పంచదార పాకం చల్లారాక ఈ రెండిటినీ బాగా కలపాలి. తరువాత ఇందులో మ్యాంగో ఎమల్షన్‌తో పాటు మిగిలిన పదార్థాలను కూడా ఒక్కొక్కటిగా వేసి బాగా కలపాలి. దీన్ని సీసాలోకి తీసుకుని ఫ్రిజ్‌లో నిల్వచేసుకోవచ్చు. మ్యాంగో స్క్వాష్ చేసుకోవాలనుకున్నప్పుడల్లా గ్లాసులో పావు వంతు దాకా తీసుకుని ముప్పావువంతు చల్లని నీళ్లు పోసుకుంటే టేస్టీ టేస్టీ మ్యాంగో స్క్వాష్ సిద్ధం.



ద్రాక్షతో..

కావలసిన పదార్థాలు

గింజల్లేని నల్లద్రాక్ష	కిలో
పంచదార	ఒకటిన్నర కిలో
నీళ్లు	ఒకటిన్నర గ్లాసు
నిమ్మ ఉప్పు	రెండు చెంచాలు
సోడియం బెంజోయేట్	పావు చెంచా
టోనోవిన్ ఎసెన్స్	అర చెంచా

తయారుచేసే విధానం

పంచదార ఒక గ్లాసు నీళ్లుపోసి స్టవ్‌పై ఉంచాలి. తీగపాకం వచ్చేదాకా మరగనివ్వాలి. తరువాత స్టవ్ ఆఫ్ చేసి ఈ పాకాన్ని పక్కన పెట్టుకోవాలి. ద్రాక్షపండ్లను బాగా కడిగి గుజ్జులా చేసుకోవాలి. దీనిని కూడా స్టవ్‌పై మరోపక్క ఉంచాలి. దీనిలో నీరంతా ఇగిరిపోయి మరీ చిక్కగా కాకుండా మధ్యస్తంగా ఉన్నప్పుడే దించేయాలి. వేడి పూర్తిగా చల్లారిన తరువాత ఇందులో పంచదార పాకం వేసి బాగా కలపాలి. దీనిలోనే నిమ్మ ఉప్పు, సోడియం బెంజోయేట్, టోనోవిన్ ఎసెన్స్ వేసి మరోసారి కలిపితే ద్రాక్ష స్క్వాష్ సిద్ధం.



పైనాపిల్‌తో..

కావలసిన పదార్థాలు

పైనాపిల్ పండ్ల ముక్కలు	నాలుగు కప్పులు
పంచదార	అరకిలో
నిమ్మ ఉప్పు	చెంచా
సోడియం బెంజోయేట్	చెంచా
లెమన్ ఎల్లో కలర్	చిటికెడు
పైనాపిల్ ఎమల్షన్	అరచెంచా

తయారుచేసే విధానం

సోడియం బెంజోయేట్, ఎమల్షన్స్ సూపర్ మార్కెట్లో దొరుకుతాయి. ముందుగా అనాస పండ్ల ముక్కలను మిక్సీ పట్టుకుని చిక్కని జూస్‌ను తయారుచేసుకోవాలి. ఈ జూస్‌ను స్టవ్‌పై ఉంచాలి. మరోవైపు పంచదారలో కొద్దిగా నీళ్లు కలిపి స్టవ్‌పై ఉంచాలి. పంచదార కరిగి లేత పాకం వచ్చి కాసేపటికి చిక్కపడుతుంది. తరువాత ఇందులో నిమ్మ ఉప్పు, లెమన్ ఎల్లో కలర్, సోడియం బెంజోయేట్, పైనాపిల్ ఎమల్షన్‌లు వేయాలి. బాగా కలిసిన తరువాత పంచదార మిశ్రమాన్ని స్టవ్‌పై నుంచి దించేయాలి. ఇందులోనే స్టవ్‌పై ఉంచిన అనాస జూస్‌ను కలపాలి. ఇది చల్లారిన తరువాత ఫ్రిజ్‌లో ఉంచుకుని ఎప్పుడు కావాలంటే అప్పుడు చల్లచల్లగా సర్వ్ చేసుకోవచ్చు.



నాసిక్ జిల్లాలో ఘోర ప్రమాదం

- ఆరుగురు చిన్నారులతో సహా 9 మంది మృతి

ప్రతిపక్షం నేషనల్ డెస్క్: మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ఓ ఎర్టిగా కారు బావిలోకి దూసుకెళ్లడంతో ఆరుగురు చిన్నారులతోసహా 9 మంది మరణించారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం గమనార్హం. డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడం వల్ల ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల సమాచారం ప్రకారం, జిల్లాలోని దిండోరి తాలూకా శివాజీనగర్ ప్రాంతంలోని రాజ్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం ఒక ప్రైవేట్ గెట్ టుగెదర్ పార్టీ జరిగింది. ఆ కార్యక్రమానికి నగరం, చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో చిన్నారులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. రాత్రి సుమారు 10 గంటల సమయంలో ఈవెంట్ ముగిసిన తర్వాత, దిండోరికి చెందిన దర్గోడే కుటుంబం ఎర్టిగా కారులో ఇంటికి తిరిగి బయలుదేరారు. అదే సమయంలో, వివాహ మండపం సమీపంలోని పొలంలో ఉన్న బావిలో కారు పడిపోవడంతో ఘోర ప్రమాదం జరిగింది. ఘటన జరిగినట్లు తెలియగానే పోలీసులు, అత్యవసర సేవల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. అయితే, బావి నీటితో నిండి ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. అర్ధరాత్రి సమయంలో రెండు క్రేన్లు, ఈతగాళ్ల సహాయంతో కారును, అందులో చిక్కుకున్న వారిని బయటకు తీశారు. ప్రమాదంలో చనిపోయిన వారిని రాఖీ సునీల్ దర్గోడ్, ఆశా అనిల్ దర్గోడ్, సృష్టి అనిల్ దర్గోడ్, సునీల్ దర్గోడ్, శ్రేయాష్ దర్గోడ్, మాధురి దర్గోడ్, సమృద్ధి దర్గోడ్, రేష్మా దర్గోడ్, శ్రావణి దర్గోడ్‌గా పోలీసులు గుర్తించారు.



పుదుచ్చేరికి రాష్ట్ర హోదా

- పేదలకు ఉచిత విద్యుత్.. విజయ్ హామీల వెల్లువ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చెన్నై, ఏప్రిల్ 4: పుదుచ్చేరికి పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను సాధించడానికి నూటికి నూరు శాతం కృషి చేస్తామని టీవీకే అధినేత విజయ్ హామీ ఇచ్చారు. కేంద్రంలో దశాబ్దాలుగా అధికారంలో ఉన్నప్పటికీ, కాంగ్రెస్, బీజేపీలు పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పించలేదని విజయ్ గుర్తు చేశారు. పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నిర్వహించిన విజయ్, డీఎంకేకాంగ్రెస్ కూటమిపై విమర్శలు గుప్పించారు. తమిళనాడు మాదిరిగానే పుదుచ్చేరిలోనూ అది ఒక గందరగోళ కూటమిగా మారిందంటూ ఎద్దేవా చేశారు. టీవీకే అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పుదుచ్చేరిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని విజయ్ వాగ్దానం చేశారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రతీ కుటుంబానికి నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతీ కుటుంబానికి 25లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని వివరించారు. పుదుచ్చేరి యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అండ్ ఆర్ట్స్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు, ప్రత్యర్థి కూటములపై విజయ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తమిళనాడులో ఉన్న పరిస్థితులే పుదుచ్చేరిలోనూ కొనసాగుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు, పుదుచ్చేరికి రాష్ట్ర హోదా గురించి కూడా విజయ్ ప్రస్తావించారు. పుదుచ్చేరికి పూర్తి రాష్ట్ర హోదా ఇవ్వాలని గతంలో ఎన్నో హామీలు ఇచ్చినప్పటికీ, కేంద్రంలో అధికారంలో ఉన్న జాతీయ పార్టీలు ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదని విజయ్ ప్రశ్నించారు. అయితే, టీవీకే అధికారంలోకి వస్తే పుదుచ్చేరికి రాష్ట్ర హోదా సాధించేందుకు కృషి చేస్తామని విజయ్ హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని తమ ఎన్నికల ప్రధాన అజెండాగా తీసుకున్నామని తెలిపారు.

సినిమా



#SDT19 అనౌన్స్‌మెంట్

మెగా సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ #SDT19 ఊహకు అందని స్థాయిలో రూపొందుతోంది. గ్రాండ్ స్కేల్ లో తెరకెక్కనున్న ఈ చిత్రం అనౌన్స్మెంట్ సినీ ప్రియుల్లో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. #SDT19 సాయి దుర్గ తేజ్ కెరీర్‌లో ఒక పవర్ ఫుల్ ఫేజ్ కి నాంది పలుకుతోంది. విభిన్నమైన కథలతో ముందుకు సాగుతున్న ఆయన 'యుగాలుగా బయటకు రాని రహస్యాలు, ఊహకు అందని శక్తులు' చుట్టూ తిరిగే ప్రపంచంలోకి అడుగు పెడుతున్నట్టు ఫస్ట్ పోస్టర్ సూచిస్తోంది. దర్శక ద్వయం సుజిత్ & సందీప్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. వీరు "క" సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. #SDT19తో వీరి విజన్ మరింత విస్తరించబోతోందని స్పష్టంగా కనిపిస్తోంది. మిథిక్ సైఫై (Mythic Scifi) నేపథ్యంలో హైఆక్టేన్ కథనాన్ని మిళితం చేస్తూ, గొప్ప సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించడానికి సిద్ధమవుతున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌ను సాహు గారపాటి తన షైన్ స్క్రీన్స్ బ్యానర్‌లో నిర్మిస్తున్నారు. వరుస విజయాలతో దూసుకుపోతున్న ఈ నిర్మాణ సంస్థ, మరోసారి ఒక డిఫరెంట్, అంబిషస్ కాన్సెప్ట్‌తో ముందుకు వస్తోంది.



మే 14న 'వీరభద్రుడు' రిలీజ్

సూర్య తన మాగ్నమోపస్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'కరుప్పు' కోసం దర్శకుడు ఆర్జే బాలాజీతో చేతులు కలిపారు. ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించడం ద్వారా పేరును తెచ్చుకున్న నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. తమిళం, తెలుగు, హిందీ పరిశ్రమలలో పాపులర్ కంటెంట్‌ను అందించిన డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని స్కేల్, కంటెంట్ రెండింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రతిష్టాత్మకగా తెరకెక్కిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ భారీ అంచనాలని సృష్టించింది. తాజాగా ఈ చిత్రానికి తెలుగులో వీరభద్రుడు అనే టైటిల్ పెట్టారు. సూర్య పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించిన టైటిల్ పోస్టర్ అదిరిపోయింది. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రానికి జికె విష్ణు సినిమాటోగ్రఫీ. 2026 మే 14న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది.



ప్రదీప్ రంగనాథ్ @ 2040 లవ్ స్టోరీ

తెలుగు, తమిళంలో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న యాక్టర్ ప్రదీప్ రంగనాథన్. గతేడాది లవ్‌టుడే, డ్రాగన్, డ్యూడ్ సినిమాలతో సూపర్ హిట్స్‌ను ఖాతాలో వేసుకున్నఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ నటిస్తున్న మూవీ లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ .కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. మేకర్స్ ప్రమోషన్స్‌లో భాగంగా ట్రైలర్ విడుదల చేశారు. ప్రపంచం ఎక్కడికో వెళ్లిపోయింది..అంటూ షురూ అయింది ట్రైలర్.. మనమిప్పుడు 2040లో ఉన్నాం. కానీ ఒకడు లేని ఒక విషయాన్ని ఉందనే అంటున్నాడు.. ఉందండి.. ఈ లవ్ ఎట్ ఫస్ట్‌సైట్ ఇంకా ఉందండి. అది ఈ అమ్మాయిని చూడగానే అర్థమైంది. తల నుంచి కాలి వేలి వరకు ఒక ఫీలింగ్ వచ్చింది మామ.. అంటూ సాగుతున్న డైలాగ్స్ యూత్ ఫుల్ స్టోరీతో ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు చెబుతున్నాయి. తమిళంతో పాటు తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ చిత్రం విడుదల కానుందని ఇప్పటికే మేకర్స్ తెలిపారు. ఈ మూవీని రౌడీ పిక్చర్స్, సెవెన్ స్క్రీన్ స్టూడియో బ్యానర్లపై ఎస్ ఎస్ లలిత్ కుమార్‌తో కలిసి నయనతార తెరకెక్కిస్తోంది. ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య, యోగి బాబు, సీమాన్, గౌరీ కిషన్, షారా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన టీజర్‌లో భవిష్యత్‌లో(2040) ప్రేమ ఎలా ఉండబోతుంది అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుందని హింట్ ఇచ్చింది విఘ్నేశ్ శివన్ టీం.



'డెకాయిట్' సెన్సార్ పూర్తి

బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ ఏప్రిల్ 10న థియేటర్లలోకి రాబోతున్న పాన్‌ఇండియా యాక్షన్‌రొమాంటిక్ థ్రిల్లర్ 'డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంతో షానియల్ డియో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శేష్ సరసన మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటించారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగ్గడ్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌లో కొనసాగుతున్నాయి. పోస్టర్లు, గ్లింప్స్, టీజర్, అలాగే 'రుబారు' చిచ్చుబుడ్డి పాటలు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన పొందుతూ సినిమాపై భారీ అంచనాలు నెలకొల్పాయి. ట్రూ బైలింగ్వల్ ప్రాజెక్ట్‌గా తెలుగు, హిందీ భాషల్లో ఒకేసారి రూపొందుతున్న ఈ చిత్రం తాజాగా రెండు భాషల్లో సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డ్ ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికేట్ ఇచ్చింది. సినిమా అద్భుతంగా వుందని సెన్సార్ సభ్యులు మూవీ టీంని అభినందించారు. అడివి శేష్ 'డెకాయిట్' తో డబుల్ హ్యాట్రిక్ కొట్టబోతున్నారు.



ఉత్కంఠ పోరులో రాజస్థాన్ విజయం

ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య పోరు అభిమానులకు పసందైన విందు అందించింది. ఆఖరి బంతి వరకు నువ్వానేనా అన్నట్లు సాగిన పోరులో గుజరాత్‌పై రాజస్థాన్‌దే పైచేయి అయ్యింది. రాయల్స్ నిర్దేశించిన 211 పరుగుల లక్ష్యఛేదన కోసం ఆఖరి ఓవర్‌లో విజయానికి 11 పరుగులు అవసరమైన దశలో గుజరాత్ నాలుగు పరుగులు చేసి వికెట్ కోల్పోయి ఓటమి వైపు నిలిచింది. తుషార్ దేశ్‌పాండే సమయోచిత బౌలింగ్‌తో రాజస్థాన్ 6 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. ఛేదనలో ఓపెనర్ సాయి సుదర్శన్(44 బంతుల్లో 73, 9ఫోర్లు, 3సిక్సులు) బాధ్యాతాయుత అర్ధసెంచరీతో ఆకట్టుకోగా, సహచరుల నుంచి సహకారం కరువైంది. బట్లర్(26), కెప్టెన్ రషీద్‌ఖాన్(24), రబాడ(23 నాటౌట్) పోరాడినా ఆఖరి మెట్టుపై గుజరాత్ బోల్తా కొట్టింది. భారీ లక్ష్యఛేదనలో గుజరాత్‌కు మెరుగైన శుభారంభం దక్కింది. గిల్ గైర్హాజరీలో అరంగేట్రం ప్లేయర్ కుమార్ కుశాగ్ర(18)తో కలిసి సుదర్శన్ సాధికారిక ఇన్నింగ్స్ ఆడాడు. రాయల్స్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ సుదర్శన్ 9 ఫోర్లు, 3 సిక్సులతో విజృంభించాడు. అయితే మిడిలార్డర్‌లో ఫిలిప్స్(3), సుందర్(4), తెవాటియా(12), షారుఖ్‌ఖాన్(11) స్థాయికి తగ్గ ఆటతీరు కనబర్చలేకపోయారు. ఇంప్యాక్ట్ ప్లేయర్ రవి బిష్ణోయ్(4/41) నాలుగు కీలక వికెట్లు తీసి గుజరాత్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. అంతకుముందు ధృవ్ జురెల్(42 బంతుల్లో 75, 5ఫోర్లు, 5సిక్సులు), జైస్వాల్(55) అర్ధసెంచరీలతో రాజస్థాన్ 20 ఓవర్లలో 210/6 స్కోరు చేసింది. జురెల్ తన ట్రేడ్‌మార్క్ షాట్లతో అలరిస్తూ జట్టు భారీ స్కోరుకు కారణమయ్యాడు. రబాడ(2/42) ఆకట్టుకున్నాడు.



రిజ్వీ అర్ధసెంచరీ
ఢిల్లీ ధనాధన్ విక్టరీ

ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ దూకుడు కొనసాగుతున్నది. తమ తొలి మ్యాచ్‌లో లక్నోసూపర్ జెయింట్స్‌ను ఓడించిన ఢిల్లీ.. మలి పోరులో ముంబై ఇండియన్స్‌ను మట్టికరిపించింది. శనివారం డబుల్ హెడర్‌లో భాగంగా జరిగిన తొలి పోరులో ఢిల్లీ 6 వికెట్ల తేడాతో ముంబైపై ఘన విజయం సాధించింది. తద్వారా వరుసగా రెండో విజయంతో రెండోస్థానంలోకి దూసుకొచ్చింది. ముంబై నిర్దేశించిన 163 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ 18.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేసింది. 'ఇంప్యాక్ట్' ప్లేయర్ సమీర్ రిజ్వీ(51 బంతుల్లో 90, 7 ఫోర్లు, 7సిక్సులు) ధనాధన్ అర్ధసెంచరీతో దుమ్మురేపాడు. ముంబై బౌలర్లకు పట్టపగలే చుక్కలు చూపిస్తూ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. లీగ్‌లో వరుసగా రెండో అర్ధసెంచరీ సాధించిన రిజ్వీ కండ్లు చెదిరే షాట్లతో ఆకట్టుకున్నాడు. 7 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయిన తరుణంలో నిస్సనక(44), డేవిడ్‌మిల్లర్(21 నాటౌట్)తో కలిసి రిజ్వీ కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. బౌల్ట్ గైర్హాజరీలో బలహీనంగా కనిపించిన ముంబైపై రిజ్వీ తన ప్రతాపం చూపించాడు. చాహర్, సాంట్నర్, బాశ్ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు ఢిల్లీ కట్టుదిట్టమైన బౌలింగ్ ధాటికి ముంబై 20 ఓవర్లలో 162/6 స్కోరుకు పరిమితమైంది. స్టాండింగ్ కెప్టెన్ సూర్యకుమార్‌యాదవ్(36 బంతుల్లో 51, 3ఫోర్లు, 2సిక్సులు) అర్ధసెంచరీతో రాణించగా, రోహిత్‌శర్మ(35) ఆకట్టుకున్నాడు. హార్దిక్ పాండ్యా బదులుగా కెప్టెన్సీ పగ్గాలు అందుకున్న సూర్యకుమార్ మినహా ముంబై బ్యాటర్లు నిలదొక్కుకోలేకపోయారు. అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకమైన రిజ్వీ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఢిల్లీ యువ బ్యాటర్ సమీర్ రిజ్వీ..మరోమారు తన విలువ చాటుకున్నాడు. గత సీజన్లలో దాదాపు రిజర్వ్ బెంచ్‌కే పరిమితమైన రిజ్వీ ఈసారి తన సత్తాఏంటో ప్రత్యర్థి జట్లకు రుచిచూపిస్తున్నాడు. ముంబై నిర్దేశించిన ఛేదనలో కేఎల్ రాహుల్(1), నితీశ్‌రానా(0) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరగా, ఇన్నింగ్స్ బాధ్యతను రిజ్వీ తన భుజానేసుకున్నాడు. నిస్సనకతో కలిసి ఇన్నింగ్స్‌ను గాడిలో పడేశాడు. బౌల్ట్ స్థానంలో తుది జట్టులోకి వచ్చిన కార్బిన్ బాశ్‌ను లక్ష్యంగా రిజ్వీ రెచ్చిపోయాడు. బాశ్ వేసిన ఇన్నింగ్స్ 11వ ఓవర్‌లో రెండు భారీ సిక్సులకు తోడు రెండు ఫోర్లతో 20 పరుగులు పిండుకున్నాడు. లెంగ్త్ బంతిని డీప్ పాయింట్‌లో సిక్స్‌గా మలిచిన రిజ్వీ..మరుసటి బంతిని లాంగాఫ్‌లో అంతే చాకచక్యంగా సిక్స్ కొట్టడంతో అరుణ్‌జైట్లీ స్టేడియం హోరెత్తిపోయింది. ఆ తర్వాత మాయంక్‌ను లక్ష్యంగా చేసుకున్న రిజ్వీ సిక్స్‌తో 31 బంతుల్లో అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. 23 బంతుల్లో 25 కొట్టిన రిజ్వీ 8 బంతుల తేడాతో 50 పరుగులకు చేరుకున్నాడు. ఈ క్రమంలో నిస్సనకతో కలిసి మూడో వికెట్‌కు 66 పరుగులు జోడించిన రిజ్వీ నాలుగో వికెట్‌కు మిల్లర్‌తో ఇన్నింగ్స్‌ను తారాస్థాయికి తీసుకెళ్లాడు. రిజ్వీని ఔట్ చేసేందుకు కెప్టెన్ సూర్య..బౌలర్లను మార్చి మార్చి ప్రయోగించినా లాభం లేకపోయింది. బౌలర్ ఎవరన్నది లెక్కచేయకుండా ముందుకు సాగిన రిజ్వీ..బౌండరీలతో లక్ష్యాన్ని అంతకంతకు కుదించాడు. స్టబ్స్(3 నాటౌట్)తో కలిసి మిల్లర్ గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశాడు. మొదట బ్యాటింగ్‌కు దిగిన ముంబై దూకుడుగా ఆడటంలో విఫలమైంది. 18 పరుగులకే ముంబై రెండు కీలక వికెట్లు కోల్పోయింది. ఈ దశలో రోహిత్‌శర్మ, సూర్యకుమార్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. వీరిద్దరు ఆచితూచి ఆడుతూ స్కోరుబోర్డుకు పరుగులు జతచేశారు. ముఖ్యంగా ఢిల్లీ స్పిన్నర్లు అక్షర్‌పటేల్, కుల్దీప్‌యాదవ్, విప్రాజ్ నిగమ్..ముంబైని నిలువరించడంలో సఫలమయ్యారు. 3ఫోర్లు, 2 సిక్సులతో సూర్య అర్ధసెంచరీ చేసినా రూథర్‌ఫర్డ్(5) ఆకట్టుకోలేకపోయాడు. నమన్ ధీర్(28), సాంట్నర్(18 నాటౌట్), బాశ్(11 నాటౌట్) స్వల్ప స్కోర్లకే పరిమితమయ్యారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200